



నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

గుంటూరు పల్నాడు

మంగళవారం 17 జూన్ 2025 - పేజీలు 8

# మహిళ సాధికారత, అభ్యున్నతికి భూమి విరాళం

- దాతృత్వం చాటుకున్న పొన్నెకంటి సువర్చల శశికిరణ్
- కొలకలూరులో ఎం.ఎస్.ఎం.ఈ. ప్రాజెక్టు కోసం ఎకరా స్థలం ప్రభుత్వానికి అప్పగింత
- రాష్ట్ర పౌర సరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ రూ.10 లక్షల విరాళం



**తెనాలి, మేజర్ న్యూస్ :** సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎం.ఎస్.ఎం.ఈ.) ఏర్పాటు కోసం తెనాలి మండలం కొలకలూరు గ్రామంలో శ్రీ పొన్నెకంటి పోతురాజు ట్రస్ట్ ఆధ్వర్యంలో పొన్నెకంటి సువర్చల శశికిరణ్ ప్రభుత్వానికి ఎకరం స్థలం విరాళంగా ఇచ్చారు. సోమవారం ఉదయం తెనాలిలో రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సమక్షంలో ఈ భూమిని ప్రభుత్వానికి అప్పగించారు. రిజిస్ట్రేషన్, రెవెన్యూ శాఖల అధికారుల సమక్షంలో దస్తావేజులను తెనాలి సబ్ కలెక్టర్ కు అందించారు. ఈ సందర్భంగా దాత సువర్చల శశికిరణ్ ను మనోహర్ సత్కరించారు. ఈ ప్రాజెక్ట్ పనులు వేగవంతంగా చేపట్టేందుకు మంత్రి నాదెండ్ల మనోహర్ సైతం రూ. 10 లక్షలు విరాళం ప్రకటించారు.

**మనోహర్ ఉన్నారనే విశ్వాసంతో...**

ఈ సందర్భంగా సువర్చల శశికిరణ్ మాట్లాడుతూ గతంలో కొలకలూరు మిగతా 3వ పేజీలో



# సంతృప్తి లెక్కల్లో చంద్రబాబు..!!

ప్రభుత్వ, పార్టీ పనితీరుపై ఎప్పటికప్పుడు సర్వేలు చేయించుకోవడం, వాటి ఫలితాలు ఆధారంగా తన నిర్ణయాన్ని మార్చుకోవడం ముఖ్యమంత్రి, తెదేపా అధినేత నారా చంద్రబాబు నాయుడు ఎప్పటినుంచో అనుసరిస్తూ ఉంటారు. పార్టీ నేతలు, ఎమ్మెల్యేలు, మంచిగా పై తీరుపై కూడా ఆయన తన వేగుల ద్వారా ఆరా తీసి దిశా నిర్దేశం చేస్తుంటారు. ఇప్పుడు తాజాగా ఆయన అమలు చేస్తున్న సూపర్ సిక్స్ పథకాల గురించి ప్రజలు ఏమనుకుంటున్నారు, వాటి అమలు సక్రమంగా జరుగుతుందా లేదా అనే అంశాలపై సర్వే చేయించుకున్నారు. ఆ సర్వే ఫలితాలు చంద్రబాబును సంతృప్తి పరిచాయని చెబుతున్నారు. అంతేకాదు కూటమి ప్రభుత్వ విధానాల పట్ల ప్రజల్లో 85 నుంచి 90 శాతం సంతృప్తి వ్యక్తం అవుతున్నట్లు ఐవిఆర్ఎస్ ఫోన్ కాల్ సర్వే ద్వారా తేటతెల్లమైనట్లు చెబుతున్నారు. ఈ సమాచారాన్ని తెదేపా నాయకులు కూడా ప్రజల్లో ప్రచారం చేస్తున్నారు. ఇది మంచి పరిణామమే. ఏ ప్రభుత్వమైనా తన పాలనకు సంబంధించి సర్వే చేయించి మార్కులు వేసుకోవడం, ప్రజలు ఏమనుకుంటున్నారు అని తెలుసుకోవడం ద్వారా మరింత మెరుగైన పాలన అందించే అవకాశం కలుగుతుంది. ఆరోగ్యశ్రీ వైద్యం రాష్ట్ర వ్యాప్తంగా 50 శాతం కూడా అందటం లేదని ఆరోపణలు వస్తున్నాయి. అయితే దీనిపై ప్రజల్లో 90 శాతం సంతృప్తి వ్యక్తమవుతున్నట్లు సర్వేలో వచ్చిందని కూటమి నేతలు చెబుతున్నారు. ఉచిత ఇసుక, రేషన్ పంపిణీ, రేషన్ వాహనాలు నిలిపివేయడం , దీపం 2 పథకాలపై ప్రజల్లో 90 శాతం సంతృప్తి ఉన్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇటీవల చెప్పారు. కానీ ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో రేషన్ మాఫియా చెలరేగిపోతోందనే విషయంపై సర్వే చేయించారా? దీని ఫలితం ఏమిటి? ఎంతమంది అధికార పార్టీ ఎమ్మెల్యేలు, ద్వితీయ శ్రేణి నాయకుల ప్రమేయం ఉందో తెలుసుకున్నారా? వీటిపై సర్వే చేపిస్తే అసలు విషయం బయటపడుతుంది... ఇలా సర్వేలో సంతృప్తి, అసంతృప్తి శాతాలను ప్రభుత్వం బేరీజు వేసుకోవాలి. అప్పుడు కానీ అసలు విషయం బోధపడుతుంది..

- గుంటూరు జిల్లా, నేటి దినపత్రిక సూర్య బ్యూరో


3 లో

చిలకలూరిపేట మున్సిపాలిటీలో కుంభకోణాలపై

# సమగ్ర విచారణ

- మున్సిపల్ శాఖ మంత్రికి నరసరావుపేట ఎంపీ లేఖ
- రూ.34.34 లక్షల. స్వాహాపై విమర్శల వెల్లువ

**చిలకలూరిపేట, మేజర్ న్యూస్ :** చిలకలూరిపేట మున్సిపాలిటీ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా దాదాపు 11 మంది సిబ్బందిపై వేటు పడటం, కొంతమంది పై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులు కోరడం తో మున్సిపల్ అధికారులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి గంగాభవాని పాల్పడిన రూ. 34,34,397 కుంభకోణం ఈ పరిణామాలకు ప్రధాన కారణం అని చెబుతున్నారు. ఈ కుంభకోణం ప్రస్తుతం మున్సిపాలిటీలో పనిచేస్తున్న ఉద్యోగుల మెడకు ఉరితాడుగా మారింది. ఈ కుంభకోణంపై సామాన్య ప్రజలకు భరోసా కల్పించేందుకు ఇటీవల చిలకలూరిపేట నియోజకవర్గ ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావు, ఎంపీ కృష్ణదేవరాయలు స్పందించారు. ఈ విషయంపై విజిలెన్స్ విచారణకు లేఖ వ్రాయాలని మున్సిపల్ చైర్మన్‌ను వారు కోరారు. వారి సూచన మేరకు, ఈ నెల 12వ తేదీన చిలకలూరిపేట మున్సిపల్ చైర్మన్ రపానీ, డైరెక్టర్ ఆఫ్ విజిలెన్స్ విభాగానికి గంగాభవాని చేసిన కుంభకోణంపై సమగ్ర విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ లేఖ రాశారు. అంతేకాకుండా, ఎంపీ కృష్ణదేవరాయులు చిలకలూరిపేట ఎమ్మెల్యే సూచన మేరకు, చిలకలూరిపేట మున్సిపాలిటీలో పారదర్శకత ఉండాలని, ఇటువంటి సంఘటనలు ప్రజల్లో నమ్మకాన్ని దెబ్బతీస్తాయని పేర్కొంటూ రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి నారాయణకు లేఖ రాశారు. చిలకలూరిపేట మున్సిపల్ కార్యాలయంలో జరిగిన 34 లక్షల కుంభకోణం, అలాగే మున్సిపాలిటీలో జరిగిన ఇతర అవకతవకలపై వెంటనే సమగ్ర విచారణ జరిపించాలని ఆ లేఖలో ఎంపీ కోరారు. ఈ మొత్తం వ్యవహారంపై విచారణ జరిపి, నిజాయితీపరులైన ఉద్యోగులు బలవ్వకుండా చూడాలని, చిలకలూరిపేట ప్రజలకు పారదర్శకమైన పాలన అందించాలని లక్ష్యంతో చిలకలూరిపేట నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, ఎంపీ కృష్ణదేవరాయలు తమ వంతు కృషి చేస్తున్నారు. ఈ కుంభకోణంపై విచారణ పూర్తి కావడం ద్వారా దోషులు శిక్షించబడి, ప్రజలకు న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నారు. మున్సిపల్ అధికారులు, ఉద్యోగులు ఈ విచారణ జరగాలని కోరారు.



## హలో నేను ఎమ్మెల్యే నసీర్ సూర్య ఘర్ పథకం ఎలా ఉంది?



**గుంటూరు, మేజర్ న్యూస్ :** "హలో నేను మీ ఎమ్మెల్యే నసీర్. సూర్య ఘర్ పథకం ద్వారా మీరు సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేసుకున్నారా ? ఏమైనా ప్రయోజనం ఉందా ? కరెంటు బిల్లు తగ్గుతుందా ? అని ఎమ్మెల్యే నసీర్ లబ్ధిదారులతో ఫోన్లో మాట్లాడారు. గుంటూరు తూర్పు ఎమ్మెల్యే కార్యాలయంలో సోమవారం విద్యుత్ శాఖ అధికారులు, బ్యాంక్ ప్రతినిధులు, వెండార్స్ తో ఎమ్మెల్యే నసీర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఇప్పటి వరకు నియోజకవర్గంలో సూర్యఘర్ పథకం ద్వారా ఎంతమంది లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్నారు ? ఎన్ని మంజూరు చేశారు ? పథకం ద్వారా కరెంట్ బిల్లు ఎంత తగ్గుతుంది ? ఎన్ని రోజుల్లో మంజూరు చేస్తున్నారు? ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నాయా అని తీశారు. సూర్యగర్ పథకం గురించి ప్రజల్లో చైతన్యవంతం తీసుకురావాలని ఈ విషయంలో అధికారులు ప్రణాళికతో ముందుకు వెళ్లాలని సూచించారు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పేదల కోసం అనేక సంక్షేమ పథకాల అమలు చేస్తున్నాయని, ఇది వారి జీవన ప్రగతిని మెరుగుపరిచే విధంగా ఉంటున్నాయని వివరించారు.

## కష్టకాలంలో పార్టీకి అండగా నిలబడే వారే నిజమైన కార్యకర్త :అంబటి మురళీకృష్ణ



**పొన్నూరు , మేజర్ న్యూస్ :** సోమవారం పొన్నూరు రూరల్ మండలం మామిళ్ళపల్లి గ్రామంలో జరిగిన గ్రామస్థాయి పార్టీ సమావేశంలో పాల్గొని పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ కార్యకర్తల గురించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు చింతలపూడి మురళీకృష్ణ, మాజీ సర్పంచ్ లంకపోతు పిచ్చిరెడ్డి, సూరిశెట్టి శివయ్య నూరు భాష మీరావలి, పటాన్ భాష, చెట్టుపల్లి కృష్ణ, కర్లపూడి శ్యాము, తోమాటి నాగేశ్వరరావు, ఈగ నాగేశ్వరరావు, కూరాకుల సాంబయ్య, ఇక్కుర్తి చలపతిరావు, పోలూరి పూర్ణచంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు తదనంతరం గ్రామస్తులు అందరూ కలిసి నూతనంగా ఏర్పాటు చేసిన వైఎస్ఆర్సిపి గ్రామ పార్టీ కమిటీని అంబటి ప్రకటించారు.

## మత్స్యకారుల కుటుంబానికి కూటమి ప్రభుత్వం అండ

- ఒక్కో కుటుంబానికి రూ. 10 లక్షలు పరిహారం ప్రకటన
- వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వెల్లడి

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**



జీవనభృతి కోసం సముంద్రంలో చేపలు వేటకు వెళ్లిన ఇద్దరు మత్స్య కారులు కోనసీమ జిల్లా అంతర్వేది వద్ద బోటు నుంచి జారిపడి మృతి చెందిన కృష్ణాజిల్లా నాగాయిలంక మండలంకు చెందిన ఇద్దరు, నాగిడి రాము, గుల్ల దామోదర గ్రామం, తమ్ము పోతురాజు, సంగమేశ్వర గ్రామానికి చెందిన మత్స్యకారుల కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అండగా నిలిచింది.గౌరవ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రత్యేక చొరవతో ప్రభుత్వం నుంచి పరిహారాన్ని ప్రకటించారు . రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ. 5 లక్షలు, మత్స్యశాఖ నుంచి రూ. 5 లక్షలు పరిహారాన్ని ప్రకటించింది. మొత్తంగా ఒక్కో కుటుంబానికి రూ. 10 లక్షలు అందించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మృతుని కుటుంబానికి అన్ని విధాల అండగా ఉంటుందని భరోసా ఇచ్చింది. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు చర్యలు తీసుకోవాలని, మత్స్యకారులకు ఎప్పటికి కప్పుడు తగిన సూచనలు, సలహాలు ఇచ్చి ప్రమాదాలు జరగకుండా తీసుకువాల్సిన జాగ్రత్తల పై అవగాహన కల్పించాలని మత్స్యశాఖ అధికారులను మంత్రి ఆదేశించారు.

# ప్రజల నిత్య జీవితంలో యోగ భాగస్వామ్యం కావాలి





- గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ వెల్లడి
- గుంటూరు గాంధీ పార్క్‌లో యోగాంధ్ర కార్యక్రమం

**గుంటూరు నగరపాలక సంస్థ, మేజర్ న్యూస్**

ప్రజలు తమ నిత్య జీవితంలో యోగాని భాగం చేసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చనే సదుద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని, రాష్ట్ర ప్రభుత్వం యోగాంధ్ర 2025 చేపట్టిందని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. సోమవారం స్థానిక గాంధీ పార్క్ లో జీఎంసి ఆధ్వర్యంలో జరిగిన యోగా కార్యక్రమం జరిగింది. యోగా అనంతరం ప్రతిజ్ఞ చేపట్టారు. ఈ సందర్భంగా ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం మే 21 నుండి జూన్ 21 వరకు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యోగాంధ్ర 2025లో భాగంగా గుంటూరు నగరపాలక సంస్థలో చారిత్రాత్మకమైన గాంధీ పార్క్ లో యోగా కార్యక్రమం చేపట్టామన్నారు. ప్రజలకు యోగ పట్ల అవగాహన కల్గించడం కోసం వార్డ్ సచివాలయాల వారీగా పలు కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఇప్పటికే షుమారు 8 లక్షల మందికి పైగా యోగాంధ్రలో తమ వివరాలు నమోదు చేసుకున్నారని, జూన్ 21న ఎన్టీఆర్ స్టేడియంలో జరిగే భారీ యోగాకి పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొనాలని కోరారు. తూర్పు నియోజకవర్గ శాసన సభ్యులు కోరిన విధంగా త్వరలో నగరంలో యోగా సెంటర్స్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. తూర్పు నియోజకవర్గ శాసన సభ్యులు నసీర్ అహ్మద్ మాట్లాడుతూ యోగా ద్వారా ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పొందడంతో పాటు సమాజం పట్ల స్పృహని కూడా కల్గిస్తుందన్నారు. యోగాని అన్ని వర్గాల ప్రజలు తమ జీవితంలో ఒక భాగంగా చేసుకోవాల్సిన అవసరం ఉందని, ఇప్పిటికే ప్రజల్లో యోగ పట్ల అవగాహన కల్గించడానికి గత 15 రోజులుగా జీఎంసి అనేక కార్యకమాలు చేపడుతందన్నారు. ప్రస్తుత పరిస్తితుల దృష్ట్యా నగరపాలక సంస్థ యోగా సెంటర్లను ఏర్పాటు చేయాలని కోరారు. డిప్యూటీ మేయర్ షేక్ సజిలా మాట్లాడుతూ మెరుగైన ఆరోగ్యానికి ఖర్చులేని ఔషదంగా యోగా ఉంటుందన్నారు. యోగాని ప్రతి ఒక్కరికీ తెలియచేయడానికి ప్రభుత్వం విరివిగా అవగాహన కార్యక్రమాలు చేపట్టిందన్నారు. ప్రతి ఒక్కరూ యోగాని సాధన చేయడం ద్వారా నిత్యం ఆరోగ్యంగా ఉండవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఎల్ఐడీసి చైర్మన్ పిల్లి మాణిక్యరావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ డాక్టర్ విజయలక్ష్మీ, జిల్లా టూరిజం శాఖాధికారి శ్రీరమ్య, డిప్యూటి కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సి.హెచ్ శ్రీనివాసరావు, టి.వెంకటకృష్ణయ్య, బి.శ్రీనివాసరావు, ఎస్ఈ నాగ మల్లేశ్వరరావు, సిటి ప్లానర్ రాంబాబు, సిఎంఓహెచ్ డాక్టర్ అమృతం, యోగా గురువు సాంబశివరావు బృందం, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, పాల్గొన్నారు.

## యోగాసన కార్యక్రమంలో అందరూ పాల్గొనాలి

**జిల్లా సంయుక్త కలెక్టర్ భార్గవ తేజ్ పిలుపు**



**గుంటూరు, మేజర్ న్యూస్ :** యోగాంధ్రా 2025 కార్యక్రమంలో భాగంగా జూన్ 21వ తేదీ అంతర్జాతీయ యోగా దినోత్సవం రోజు జిల్లాలో నిర్దేశించిన ప్రాంతాల్లో యోగాసనాల కార్యక్రమాలు అన్ని వర్గాల ప్రజలను భాగస్వాములను చేస్తూ నిర్వహించేలా మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు పకడ్బందీ ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకోవాలని జిల్లా సంయుక్త కలెక్టర్ ఏ భార్గవ్ తేజ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయం సంయుక్త కలెక్టర్ ఛాంబర్ నుంచి జిల్లా సంయుక్త కలెక్టర్ ఏ భార్గవ్ తేజ యోగాంధ్రా 2025 కార్యక్రమాల నిర్వహణపై మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సంయుక్త కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ మాట్లాడుతూ అంతర్జాతీయ యోగా దినోత్సవం జూన్ 21వ తేదీన భారీ స్థాయిలో యోగాసనాలు కార్యక్రమం నిర్వహించడానికి గ్రామ , వార్డు సచివాలయాల పరిధిలో గుర్తించిన 4879 ప్రాంతాలను ముందస్తుగా ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు పరిశీలించి యోగాసనాల నిర్వాహణకు అవసరమైన ఏర్పాటు చేయాలన్నారు. యోగాంధ్రా కార్యక్రమంలో రిజిస్ట్రేషన్ చేసుకున్న వారందరినీ అంతర్జాతీయ యోగా దినోత్సవం రోజు మెగా యోగాసనాలు కార్యక్రమంలో పాల్గొనేలా విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. యోగాసనాలు శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికేట్ల జనరేషన్ కార్యక్రమాన్ని రెండు రోజుల్లో పూర్తి చేయాలన్నారు.

## ప్రజా ఫిర్యాదులను గడువులోగా పరిష్కరిస్తాం : నగర కమిషనర్ వెల్లడి



**గుంటూరు నగరపాలక సంస్థ, మేజర్ న్యూస్**

గుంటూరు నగరంలో స్థానిక సమస్యల పరిష్కారం కోసం నగరపాలక సంస్థలో చేపట్టే డయల్ యువర్ కమిషనర్, పిజిఆర్ఎస్ లో ప్రజలు ఇస్తున్న అర్జీలు రీ ఓపెన్ కాకుండా, ప్రజలు సంతృప్తి చెందేలా నిర్దేశిత గడువులోగా శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు.స్పష్టం చేశారు. సోమవారం నగరపాలక సంస్థ కమిషనర్ చాంబర్ లో డయల్ యువర్ కమిషనర్, కౌన్సిల్ హాల్లో పిజిఆర్ఎస్ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ తొలుత డయల్ యువర్ కమిషనర్ ద్వారా ప్రజల నుండి అందిన 27 ఫిర్యాదులు తీసుకొని, అధికారులతో మాట్లాడుతూ ప్రజల నుండి అందే అర్జీల్లో తక్షణం పరిష్కారం చేయగలిగినవి, కొంత సమయం తర్వాత చేయగలిగినవి వేరువేరుగా లిస్టు తయారు చేయాలన్నారు. డయల్ యువర్ కమిషనర్ కి అందిన ఆర్జీల పరిష్కారానికి విభాగాధిపతులే క్షేత్ర స్థాయి పరిశీలనకు వెళ్లాలన్నారు. అర్జీల పరిష్కార పురోగతిపై కమిషనర్ చాంబర్ కు ఎప్పటికప్పుడు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం కౌన్సిల్ సమావేశ మందిరంలో పిజిఆర్ఎస్ కార్యక్రమం ద్వారా ప్రజల నుండి అర్జీలు తీసుకొని కమిషనర్ అధికారులతో మాట్లాడుతూ పిజిఆర్ఎస్ లో ప్రజలు ఇస్తున్న అర్జీలను సమగ్రంగా పరిష్కారం చేయాలని, ఆయా ఆర్జీలను ర్యాండమ్ గా క్షేత్ర స్థాయి పరిశీలన చేస్తామన్నారు. అర్జీలు బియండ్ ఎస్ఎల్ఏ లోకి వెళ్లడానికి వీలులేదన్నారు. క్షేత్ర స్థాయి అధికారులు ఆర్జీలను నేరుగా వెళ్లి పరిశీలించి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. పారిశుధ్యం, త్రాగునీటి సరఫరా, రోడ్ల ఆక్రమణ వంటి సమస్యల పరిష్కారం కోసం ప్రజలు జిఎంసి కార్యాలయానికి వస్తున్నారని, అవి స్థానికంగానే పరిష్కారం చేయాలన్నారు. ప్రజల నుండి అందే అర్జీలు, ఫిర్యాదుల నమోదుకి ప్రతి విభాగంలో సూపరిండెంట్ ఆధ్వర్యంలో సిబ్బందిని కేటాయించి, ప్రత్యేకంగా రిజిస్టర్ ఏర్పాటు చేయాలన్నారు. పరిష్కారం అనంతరం ఫిర్యాదికి సమాచారం తెలియచేయాలన్నారు. పిజిఆర్ఎస్ ద్వారా పట్టణ ప్రణాళిక విభాగం 18, ఇంజినీరింగ్ విభాగం 17, రెవెన్యూ విభాగం 2, ప్రజారోగ్య విభాగం 2, ఉపా సెల్ విభాగం 3, అకౌంట్స్ విభాగానికి సంబందించి 2 ఫిర్యాదులు మొత్తం 44 ఫిర్యాదులు అందాయన్నారు. పిజిఆర్ఎస్ లో ప్రజల నుండి అందిన ఆర్జీలను విభాగాల వారిగా విబజించి, సంబంధిత విభాగాదిపతులకి పంపి సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సిహెచ్.శ్రీనివాస్, బి.శ్రీనివాస రావు, సిఎంఓహెచ్ డాక్టర్ అమృతం, సిపి రాంబాబు, ఏఏఎస్ డాక్టర్ వెంకటేశ్వరరావు, ఈఈలు సుందర్రామి రెడ్డి, కోటేశ్వరరావు, పాల్గొన్నారు.

# సంతృప్తి లెక్కల్లో చంద్రబాబు..!!

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**

రాష్ట్ర ప్రజల సంతృప్తిపై చంద్రబాబు మరోసారి సర్వే నిర్వహించారు. ఐవిఆర్ఎస్ ఫోన్ కాల్స్ ద్వారా తీసుకున్న సర్వే నివేదికలను తాజాగా ఆయన పార్టీ నాయకులు కార్యకర్తలకు చెప్పుకొచ్చారు. దాదాపు అన్ని విషయాల్లోనూ ప్రజలు సంతృప్తిగా ఉన్నారని 85 నుంచి 90 శాతం మధ్య సంతృప్తి కనిపిస్తోందని ఆయన వెల్లడించారు. ఇది మంచిదే. ఏ ప్రభుత్వమైనా తన పాలనకు సంబంధించి మార్కులు వేసుకోవడం ప్రజలకు ఏమను కుంటున్నారు అనేది తెలుసుకోవడం ద్వారా మరింత మెరుగైన పాలన అందించేందుకు, మరింత మెరుగైన విధానాలను తీసుకువచ్చేందుకు అవకాశం ఉంటుంది. అయితే చంద్రబాబు చేస్తున్న ఈ ప్రయోగాలు ఏకపక్షంగా ఉన్నాయనే మాట పరిశీలకుల మధ్య వినిపిస్తోంది. ఎందుకంటే ఆరోగ్యశ్రీ రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 50 శాతం మందికి కూడా అందడం లేదు. కానీ తాజా సర్వేలో ఆరోగ్యశ్రీపై ఏకంగా 92 శాతం మంది సంతృప్తితో ఉన్నారని చంద్రబాబు చెప్పారు. అదే విధంగా ఇతర సంక్షేమ పథకాలు విషయాన్ని తీసుకుంటే అందరూ ఆనందంగా ఉన్నారని 80 శాతం మంది సంతోషంగా ఉన్నారని చెప్పుకొచ్చారు. ఇది క్షేత్రస్థాయిలో చూసుకుంటే సరైనది కాదనేది సొంత పార్టీలోనూ వినిపిస్తున్న మాట. ఎందుకంటే సాధారణంగా ప్రజల్లో ఉన్న అసంతృప్తిని తగ్గించేందుకు ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తాయి. ఈ పరంగా చూసుకున్నప్పుడు చంద్రబాబు కూడా ప్రయత్నం చేస్తున్నప్పటికీ వాస్తవాన్ని విస్మరిస్తున్నారని మాట వినిపిస్తోంది. ఉదాహరణకు ఏ పని కావాలన్నా రాష్ట్రస్థాయిలో చేతులు తడపందే పనులు కావడం లేదని సొంత పార్టీకి చెందిన కార్యకర్తలు



అభిమానులు సానుభూతిపరులు కూడా బహిరంగంగానే వెల్లడిస్తున్నారు. కానీ కాజా సర్వేలో మాత్రం 85 శాతం మంది అసలు అవినీతి లేదని చెప్పారని సర్వే చేసి చెప్పినట్టు చంద్రబాబు చెప్పుకొచ్చారు. ఇక ఆసుపత్రుల్లో నిర్వహణ అత్యంత అధ్వానంగా ఉందని నాలుగు రోజుల కిందట టిడిపిని బలపరిచే ఒక ప్రధాన పత్రిక ఆధారాలతో సహా బయటపెట్టింది. కానీ తాజా సర్వేలో 80 శాతం మంది ఆసుపత్రులలో నాణ్యమైన వైద్యం అందిస్తున్నారని ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయాలు అద్భుతంగా ఉన్నాయని తేల్చి చెప్పినట్టు చంద్రబాబు ప్రకటించారు. ఇక, నగరాలు పట్టణాల్లో వైద్య సిబ్బంది అందుబాటులో లేరని వారు సొంత కార్యక్రమాల్లో తిరుగుతున్నారని గత వారం రోజులుగా కూడా పత్రికల్లో కథనాలు వస్తున్నాయి. తాజాగా కూడా ఒక వైద్యురాలు ఆసుపత్రుల్లోనే నిద్రపోవడం, ఆ సమయంలో పేషంట్లకు వైద్యం అందకపోవడంతో ఓ చిన్నారి మృతి చెందిన ఘటన రాష్ట్రంలో చోటుచేసుకుంది. అయినా దీనిపై సంతృప్తి 90 శాతం ఉందని సర్వే చెప్పినట్టు చంద్రబాబు తేల్చి చెప్పేశారు. ఇక ఇసుక విషయానికి వస్తే ఇది సాధారణ ప్రజలకు అందుబాటులో లేదనేది అందరికీ తెలిసిన విషయం. కానీ ఇసుకపై ఏకంగా 79 శాతం మంది

- ఈ లోపాల మాటేంటి .. !
- చేల రేగిపోతున్న రేషన్ మాఫియాపై సర్వే ఏది
- వన్‌టైం ఎమ్మెల్యేల పనితీరు ఎలా ఉందో తెలుసుకున్నారా
- సంతృప్తి, అసంతృప్తి ఎక్కడెక్కడ ఉందో గుర్తించారా..
- ప్రజల సంతృప్తిపై చంద్రబాబు మరోసారి సర్వే

సంతోషంగా ఉన్నారని చంద్రబాబు చెప్పుకొచ్చారు. అదేవిధంగా రేషన్ పంపిణీ వాహనాలు నిలిపివేయడంపై 90 శాతం మంది దీపం 2 పథకంపై ప్రజలు 98 శాతం మంది సంతోషంగా ఉన్నారని చంద్రబాబు చెప్పారు. వాస్తవానికి ఈ రెండు కూడా చాలా తప్పు అనేది క్షేత్రస్థాయిలో వినిపిస్తున్న మాట. రేషన్ డోర్ డెలివరీ లేని కారణంగా పంచాయతీలు అదేవిధంగా నగరపాలక సంస్థలోని మారుమూల ప్రాంతాల్లో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రెండు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్నటువంటి ఇళ్లకు వాళ్ళు మోసుకొని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇక ఈ సర్వే రిపోర్ట్ లలో ఆర్టీసీ విషయానికి కూడా చంద్రబాబు మంచి మార్కులు వచ్చాయని చెప్పుకొచ్చారు. ఏకంగా ఆర్టిసి సౌలభ్యం పై 90 శాతం మంది ప్రజలు సంతోషంగా ఉన్నారని చెప్పారు. కానీ ప్రైవేటు రంగాన్ని ఆర్టిసి డామినేట్ చేయలేకపోతుండడం ప్రధానంగా చర్చనీయాంశం. ఇప్పటికీ పల్లెల్లో అటు పట్నాల్లో కూడా ఆర్టీసీ సేవలు పెద్ద ఆశించినంత స్థాయిలో అయితే లేవనేది వాస్తవం. అన్ని విషయాల్లోనూ సర్వే రిపోర్ట్ లు ఒకరకంగా క్షేత్రస్థాయిలో ప్రజల అభిప్రాయం మరోరకంగా ఉండడం ఆలోచించాల్సిన విషయం.

## డయేరియాను ఆపండి.. క్యాంపెయిన్ పకడ్బందీగా నిర్వహించండి

**అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్**

**గుంటూరు, మేజర్ న్యూస్ :** ప్రభుత్వ ఆదేశాల మేరకు జూన్ 2 నుండి జులై 31 వరకు "డయేరియాను ఆపండి" క్యాంపెయిన్ జిల్లాలో పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మీ వైద్య శాఖాధికారులను ఆదేశించారు. సోమవారం కలక్టరేట్‌లోని ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో అతిసార వ్యాధిని అరికట్టేందుకు రూపొందించిన ప్రచార పోస్టర్లను జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మీ , సంయుక్త కలెక్టర్ ఏ. భార్గవ్ తేజ , డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీ కుమారి, డిఆర్ఓ ఎన్.ఎస్.కే.ఖాజావలి , ఆర్డిఓ శ్రీనివాస రావు , డియం అండ్ హెచ్ ఓ డా. విజయలక్ష్మీ , జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డా. శ్రావణ్ బాబు , ఈడి ఎస్.సి కార్పొరేషన్ శ్రీనివాస్ వైద్య ఆరోగ్య అధికారులతో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మీ మాట్లాడుతూ జిల్లాలో అతిసార వ్యాధిని



అదుపు చేసేందుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలన్నారు. సీజనల్ వ్యాధులలో ప్రమాదకరమైన అతిసార వ్యాది పై ప్రజలకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. డయేరియాపై అవగాహన కల్పించడం ద్వారా ఈ వ్యాధిని అరికట్టవచ్చన్నారు. ఇందులో భాగంగా జిల్లాలో 5 ఏళ్ల లోపు వున్న పిల్లలందరికి ఉచితంగా రెండు ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు , 14 జింక్ మాత్రలను పంపిణీ చేయాలన్నారు. జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు , పట్టణ ప్రాంత ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఆశా వర్కర్లు , ఎ ఎన్ ఎం ల ద్వారా పంపిణీ చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అవసరమైన వారికి ఓఆర్ ఎస్, జింక్ మాత్రలను పంపిణీ చేయడంతో పాటు వారికి పరిశుభ్రత , ఆరోగ్య పరి రక్షణ పట్ల అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో ఎక్కడా త్రాగునీరు కలుషితం అవ్వ కుండా చూడాలని అధికారులను కోరారు. అనంతరం అంగన్ వాడీ చిన్నారులకు జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మీ జింక్ మాత్రలు , ఓ ఆర్ ఎస్ ప్యాకెట్స్ ను అందించారు. ఈ కార్యక్రమంలో డీడీ గ్రౌండ్ వాటర్ వందనం , సిపిఓ శేషశ్రీ, ఎస్.ఈ పంచాయితీ రాజ్ బ్రహ్మయ్య, ఏ.డి హార్టికల్చర్ రవీంద్ర బాబు, జిల్లా ఉపాధి అధికారి దుర్గాబాయి, డిపిఓ బి.వి.నాగ సాయి కుమార్, కొండారావుపేట యూపీహెచ్సి డా. హమీద్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తల్లికి వందనం ఒక గొప్ప అధ్యాయం

- ప్రతి కుటుంబంలో ఆనందాలకు అవధులు లేవు
- గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**

రాష్ట్రంలో తల్లికి వందనం పండుగ సంబరాలు జరుగుతున్నాయని, ఇది దేశంలోనే ఒక గొప్ప అధ్యాయమని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. తల్లికి వందనం పథకం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా 65 లక్షల మందికి సుమారు రూ.10 వేల కోట్ల నిధులు జమైన సందర్భంగా సోమవారం గుంటూరు తూర్పు ఎమ్మెల్యే కార్యాలయంలో నసీర్ మాట్లాడారు. ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా తల్లికి వందనం పథకాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు . గత వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వంలో ఐదేళ్లపాటు అప్పులు చేసి ప్రజలకు తిప్పలు మిగిల్చారని విమర్శించారు. గత ప్రభుత్వంలో అమ్మఒడి పేరుతో కేవలం కుటుంబంలో ఒక విద్యార్థికి మాత్రమే అమలు చేశారని తెలిపారు. కుటుంబంలో ఇద్దరు ముగ్గురు పిల్లలు ఉన్న కుటుంబానికి ఇది తీవ్ర ఆర్థిక భారంగా మారిందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో యువ నాయకులు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో విద్యా ప్రమాణాలు పెంచుతూ ప్రత్యేకమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇప్పుడు కుటుంబంలో ముగ్గురు పిల్లలు ఉంటే అందరికీ తల్లికి వందనం అమలు కావడంతో వారి సంతోషానికి అవధులు లేవని పేర్కొన్నారు. ఈ సందర్భంగా తల్లికి వందనం నిధులు జమైన ప్రతి కుటుంబానికి ఆయన ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు.

## మహిళ సాధికారత, అభ్యున్నతికి భూమి విరాళం

(మొదటి పేజీ తరువాయి)

గ్రామానికి ఎన్నో ప్రభుత్వ ప్రాజెక్టులు వచ్చాయి. అయితే స్థలం లేమి కారణంగా వెనక్కి వెళ్లిపోయాయి. స్థలం సమస్య కారణంగా ఈ ప్రాంత మహిళలు ఉపాధి కోల్పోవడం భావ్యంకాదని భావించి నాకున్న అర ఎకరంతోపాటు పక్కనున్న మరో అర ఎకరం కొనుగోలు చేసి ప్రభుత్వానికి అందించాం. శ్రీరాముడికి ఊడత సాయం చేసినట్లు.. ప్రభుత్వానికి నా వంతు సాయం అందిస్తున్నాను. ప్రతిఫలం ఆశించకుండా పది మందికి ఉపయోగపడాలని మా తండ్రి పోతురాజు చెప్పేవారు. ఆయన మాటలను స్ఫూర్తిగా తీసుకొని ఈ రోజు ఈ నిర్ణయం తీసుకున్నాను. నాదెండ్ల మనోహర్వద్ద ఈ ప్రాంత అభివృద్ధికి సంబంధించి ఎన్నో ప్రణాళికలు ఉన్నాయి. ఆయనో విజనరీ. మా ఊరిని అభివృద్ధి చేస్తారనే నమ్మకం ఉంది. మంత్రి మనోహర్ ఉన్నారు, తప్పకుండా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తారనే విశ్వాసంతో ఆయన సమక్షంలో ప్రభుత్వానికి స్థలం ఇచ్చాము.

**జనసేన యువత మద్దతుగా ఉన్నారు**

మా ప్రాంత మహిళలకు ఉపాధి అవకాశాలు మెరుగుపరచాలనే లక్ష్యంతో పని చేస్తున్నాము. నా వెన్నంటి జనసేన యువత ఉన్నారు. నా మీద అచంచల విశ్వాసం ఉంది. ఏదైనా చెబితే తప్పకుండా చేద్దాము అని ఉత్సాహంగా, మద్దతుగా ముందుకు వస్తారు. ఒక అభివృద్ధి ప్రాజెక్ట్ వస్తే ఆ వెనుక మరికొన్ని వస్తాయి. ఉపాధి అవకాశాలు లభిస్తాయి"న్నారు.

**పనుల్లో జాప్యం లేకుండా చూస్తాం: నాదెండ్ల మనోహర్**

రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ తెనాలి నియోజకవర్గంలో మహిళలు, యువత ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం తరఫున చర్యలు తీసుకుంటున్నాం. యూనిట్ల ఏర్పాటుతోపాటు శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసి స్కిల్ డెవలప్మెంట్ కి కృషి చేస్తాం. ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతోంది. తెనాలిలో కూడా పలువురు దాతల సహకారంతో మన ప్రాంతానికి పేరు తెచ్చే కార్యక్రమాలు జరుగుతున్నాయి. గతంలో తెనాలి ప్రాంతంలో మహిళల కోసం ప్రత్యేక ఎంఎస్ఎంఈ ప్రాజెక్టు పెడదామని ఆలోచన చేశాం. అప్పట్లో ప్రభుత్వ భూమి లభ్యత లేక ప్రాజెక్టు చర్చల దశలో నిలిచిపోయింది. అదే విషయం శ్రీమతి సువర్చల శశికిరణ్ తో చర్చించినప్పుడు కొలకలూరు గ్రామంలో ఎకరం భూమిని ఇచ్చేందుకు ముందుకు వచ్చారు. చిన్న కుటుంబ నేపథ్యమే అయినప్పటికీ తన తండ్రి పోతురాజు పేరు నిలబెట్టాలన్న ఉద్దేశంతో ఆ కుటుంబం ఆదర్శవంతంగా నిలిచింది. ఈ ప్రాజెక్టు కోసం మా కుటుంబం నుంచి రూ.10 లక్షలు విరాళంగా ఇస్తాం. భవన నిర్మాణం పనుల్లో ఎక్కడా జాప్యం లేకుండా ప్రాజెక్టు త్వరితగతిన పూర్తయ్యే విధంగా మా వంతు సహకారం అందిస్తామన్నారు.

## యోగాడేను వైజాగ్‌లో నిర్వహించడం గర్వకారణం

**గుంటూరు, మేజర్ న్యూస్ :** ఈ నెల 21న జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమం ఆంధ్రప్రదేశ్ లోని వైజాగ్ నగరంలో జరగటం చాలా గర్వకారణంగా ఉందని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. సోమవారం 'యోగాంధ్ర' కార్యక్రమం ఏర్పాట్లను వైజాగ్ లో సీఎం చంద్రబాబుతో కలసి మంత్రి అచ్చెన్నాయుడు పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమ నిర్వహణను ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారని, దానిలో భాగంగా అధికారులకు, తమకు సీఎం చంద్రబాబు పలు కీలక సూచనలు చేశారని తెలిపారు. ఈ సందర్భంగా తొలుత విశాఖలోని ఓ ప్రయివేట్ హోటల్ లో పార్లమెంట్ ప్రజాప్రతినిధులు, మంత్రులు, అధికారులు, కూటమి పార్టీ నేతలతో చంద్రబాబు నిర్వహించిన కీలక సమావేశంలో మంత్రి అచ్చెన్నాయుడు పాల్గొన్నారు. ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాల్గొననుండటంతో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్ల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని, విశాఖ ఆర్కే బీచ్ వేదికగా జరగనున్న ఈ యోగా దినోత్సవ కార్యక్రమానికి సుమారు ఐదు లక్షల మంది హాజరవుతారని అంచనా వేస్తున్నామని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు 607 సచివాలయాల సిబ్బంది హాజరవుతున్నారని, వారిని అధికారులు సమన్వయం చేస్తారని తెలిపారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటామని అన్నారు. యోగా దినోత్సవ కార్యక్రమంలో పాల్గొనే వారితో ముందుగా మాక్ యోగా నిర్వహించాలని సీఎం చంద్రబాబు సూచించారని తెలిపారు. ప్రధానమంత్రితో పాటు పలువురు ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నందున పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా, సామాన్య ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారని అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం బ్రహ్మాండంగా విజయవంతం చేయాల్సిన బాధ్యత అందరిదని, మోదీ హాజరయ్యే కార్యక్రమంలో ఎక్కడా ఎలాంటి పొరపాట్లు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సూచించినట్టు మంత్రి అచ్చెన్నాయుడు చెప్పారు.

## తాడేపల్లి సీఐగా వీరేంద్ర బాబు బాధ్యతల స్వీకరణ




**తాడేపల్లి, మేజర్ న్యూస్:**

తాడేపల్లి సీఐగా పి.వీరేంద్రబాబు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న సీఐ కళ్యాణ్ రాజును వీఆర్‌కు పంపడంతో ఆ స్థానంలో వీఆర్‌లో ఉన్న వీరేంద్రబాబును తాడేపల్లి సీఐగా నియమించారు. ఈ సందర్భంగా తాడేపల్లి సర్కిల్ కార్యాలయానికి చేరుకున్న వీరేంద్ర బాబు బాధ్యతలు చేపట్టి మాట్లాడారు. శాంతి భద్రతల విషయంలో రాజీ లేకుండా పని చేస్తామన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. ప్రధానంగా తాడేపల్లి ప్రాంతంలో గంజాయి విక్రయాలకు సంబంధించి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి అరికట్టేందుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన సీఐ వీరేంద్ర బాబుకు ఎస్ఐలు ఖాజావలి,జె.శ్రీనివాసరావుతో పాటు సిబ్బంది అభినందనలు తెలిపారు. అనంతరం డీఎస్పీ మురళీకృష్ణను సీఐ వీరేంద్రబాబు మర్యాదపూర్వకంగా కలిశారు.

## విద్యాశాఖ అభివృద్ధికి మంత్రి లోకేష్ ఎనలేని కృషి

### - మార్కెట్ యార్డ్ చైర్మన్ జవ్వాది కిరణ్ చంద్




**మంగళగిరి, మేజర్ న్యూస్:**

విద్యాశాఖ అభివృద్ధికి రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేష్ ఎనలేని కృషి చేస్తున్నారని మార్కెట్ యార్డ్ చైర్మన్ జవ్వాది కిరణ్ చంద్ అన్నారు. సోమవారం మంగళగిరి మండలం పెదవడ్లపూడి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఆయన నోట్ బుక్స్ బ్యాగులను అందజేశారు. ఈ సందర్భంగా కిరణ్ చంద్ మాట్లాడుతూ...ఇచ్చిన మాటకు కట్టుబడి ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి తల్లికి వందనం ద్వారా నగదు తల్లుల ఖాతాలో ప్రభుత్వం జమ చేయడం జరిగిందని ఇది ఒక చరిత్ర అని కొనియాడారు. రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రి, స్థానిక శాసనసభ్యులు నారా లోకేష్ విద్యాశాఖ అభివృద్ధికి ఎన్నో పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వం పంపిణీ చేసిన నోట్ బుక్స్ బ్యాగులపై వ్యక్తిగత ప్రచారం చేసుకున్నారని, ఆనాటి ముఖ్యమంత్రి వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి ఫోటోలను వేశారని విమర్శించారు. అయితే కూటమి ప్రభుత్వం వీటన్నిటికీ ఫుల్ స్టాప్ పెట్టిందని ప్రచారానికి దూరంగా పేదలకు మేలు చేయడమే లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. నోట్ బుక్స్, బ్యాగులపై ఎటువంటి రాజకీయ నాయకుల ఫోటోలను ముద్రించకుండా ఉండటమే ఇందుకు నిదర్శనమన్నారు. అందరికీ ఆదర్శనీయమైన మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణ ఫోటోలను ముద్రించడం అభినందనీయమని, ఆయన గురించి తెలియని నేటి బాలలకు దీనిద్వారా ఎంతగానో అవగాహన కలుగుతుందన్నారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ఎన్నో ప్రజా సంక్షేమ కార్యక్రమాలను చేపట్టిందని, అందులో భాగంగా ఉచిత ఇసుక విధానం, గంజాయి పై ఉక్కు పాదం, ల్యాండ్ టైటిల్ యాక్ట్ రద్దు చేయడం, శిథిలావస్థకు చేరిన రోడ్ల స్థానంలో నూతనంగా రోడ్లను నిర్మించారని తెలిపారు. విద్యార్థులు చిన్నతనం నుండి కష్టపడి చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ గ్రామ పార్టీ అధ్యక్షులు యేళ్ళ శివరామయ్య, మాదల రమేష్ బాబు, చిట్టిబొమ్మ వెంకటేశ్వరరావు, యేమినేని సుధాకర్, జాలాది సందీప్, బొర్రా శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యారంగంలో విప్లవాత్మక సంస్కరణలు

### - విద్యార్థులు రేపటి ధృవతారలుగా రాణించాలన్నదే లోకేష్ ఆకాంక్ష

### - ఏపీ బయోడైవర్సిటీ చైర్మన్ నీలాయపాలెం విజయ్ కుమార్

**మంగళగిరి, మేజర్ న్యూస్:**

రాష్ట్ర ఐటీ విద్యాశాఖల మంత్రి నారా లోకేష్ నేతృత్వంలో విద్యారంగంలో విప్లవాత్మక సంస్కరణలు అమలు చేస్తున్నట్లు ఏపీ బయోడైవర్సిటీ చైర్మన్ నీలాయపాలెం విజయ్ కుమార్ అన్నారు. మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ప్రతి తల్లికి పూర్తిస్థాయిలో నిజమైన 'తల్లికి వందనం' పథకాన్ని అమలు చేసిందని, రాష్ట్రంలో పాఠశాలలు తెరిచిన తర్వాత విద్యార్థుల కళ్లల్లో ఆనందం స్పష్టంగా కనిపించిందన్నారు. విద్యాశాఖ మంత్రి లోకేష్ నాయకత్వంలో విద్యారంగంలో తీసుకొచ్చిన విప్లవాత్మక సంస్కరణలతో ఆంధ్రప్రదేశ్ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. గత జగన్ రెడ్డి ప్రభుత్వంలో విద్యావ్యవస్థ అస్తవ్యస్తంగా, అవినీతితో గందరగోళంగా మారిందని, ఈ పరిస్థితిని సరిచేయడానికి మంత్రి లోకేష్ ధైర్యంగా ముందుకొచ్చి ఒక్క సంవత్సరంలోనే అనేక సంస్కరణలు తీసుకొచ్చారన్నారు. గత ప్రభుత్వంలో 12 లక్షల మంది విద్యార్థులు చదువు మానేశారని, ఇది వైసీపీకి తొలగని మచ్చగా మిగిలిందన్నారు. వైసీపీ హయాంలో 88 లక్షల మంది విద్యార్థులు ఉన్నప్పటికీ, కేవలం 42 లక్షల మందికి మాత్రమే 'అమ్మఒడి' అందించారని మేము 67.27 లక్షల మంది విద్యార్థులకు 'తల్లికి వందనం' పథకం ద్వారా సహాయం అందించామన్నారు. గత ప్రభుత్వం కంటే 25 లక్షల మంది విద్యార్థులకు అదనంగా అందించామన్నారు. ప్రతి విద్యార్థికి రూ. 13వేలు అందజేసి, రూ. 2వేలు కలెక్టర్ ఖాతాలో జమ చేసి, పాఠశాల సౌకర్యాలు, విద్యా కమిటీల కోసం ఉపయోగిస్తున్నట్లు తెలిపారు. ఇంట్లో ఎంతమంది విద్యార్థులు ఉన్నా అందరికీ రూ. 13వే చొప్పున 'తల్లికి వందనం' అందిస్తున్నామని, జగన్ లా ఒక బిడ్డను ఎంచుకోమని తల్లులను ఇబ్బంది పెట్టలేదన్నారు. 18.55 లక్షల మంది ఒక బిడ్డ ఉన్న తల్లులు, 14.55 లక్షల మంది ఇద్దరు పిల్లల తల్లులు, 2.10 లక్షల మంది ముగ్గురు పిల్లల తల్లులు, 20వేల మంది నలుగురు పిల్లల తల్లులకు లబ్ది చేకూర్చినట్లు తెలిపారు.



మొత్తం 54,94,703 మంది విద్యార్థులకు, 35,44,459 మంది తల్లులకు ఈ పథకం ద్వారా ఆనందం కలిగించామన్నారు. ఇందులో 66,414 మైనార్టీ, 50,740 ఆర్య వైశ్య, 10,29,424 బీసీ ఏ, 6,75,418 బీసీ బీ, 12,761 బీసీ సీ, 8,62,381 బీసీ డీ, 16,998 బ్రాహ్మణ, 48,606 ఈబీసీ, 90,876 కమ్మ, 4,52,221 కాపు, 13,654 క్షత్రియ, 1,70,937 రెడ్డి, 11,75,918 ఎస్సీ, 4,26,330 ఎస్టీ విద్యార్థులు ఉన్నారని తెలిపారు. వైసీపీ ప్రభుత్వం నిధులను దుర్వినియోగం చేసి, ఫేక్ కంపెనీలకు ధారాదత్తం చేసే ప్రయత్నాలను అడ్డుకుని వేల కోట్ల నిధులను ఆదా చేసి విద్యా వ్యవస్థను ముందుకు తీసుకువెళుతున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం విద్యార్థుల ఫీజు రీయంబర్స్‌మెంట్‌లను చెల్లించకుండా రూ. 3,400 కోట్ల బకాయిలను వదిలివెళ్లిందని, ఈ బకాయి లను కూటమి ప్రభుత్వం తీరుస్తుందన్నారు. లోకేష్ విద్యార్థుల బ్యాగ్ బరువును తగ్గించేందుకు నిర్ణయం తీసుకున్నారని, ప్రైమరీ విద్యార్థులకు 52 టెక్స్ట్‌బుక్‌ల నుంచి 32కి, సెకండరీ విద్యార్థులకు 58 నుంచి 46కు తగ్గించారన్నారు. అన్ని యాప్‌లను తొలగించి ఏకీకృత యాప్‌ను ప్రవేశపెట్టారని, దీనికి ఉపాధ్యాయులు స్వాగతం పలికారని తెలిపారు. విద్యార్థులు రేపటి ధృవతారలుగా రాణించాలన్నదే లోకేష్ ఆకాంక్ష అని విజయ్ కుమార్ అన్నారు.

## మెరుగైన సాగు కోసం జాగ్రత్తలు తప్పనిసరి

- పొగాకు, మొక్కజొన్న సాగులో అప్రమత్తత అవసరం..!
- వ్యవసాయ శాఖ అధికారులతో సమీక్షలో ఎమ్మెల్యే జూలకంటి..

**వెల్దుర్తి మేజర్ న్యూస్ :**

పొగాకు, మొక్కజొన్న సాగు విషయంలో నియోజకవర్గంలోని రైతులు అప్రమత్తంగా ఉండాలని మాచర్ల శాసన సభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి సూచించారు. సోమవారం వెల్దుర్తి క్యాంపు కార్యాలయంలో ఖరీఫ్ సీజన్ పై నియోజకవర్గ వ్యవసాయశాఖ అధికారులతో ఎమ్మెల్యే జూలకంటి సమీక్ష నిర్వహించారు. ఖరీఫ్‌లో విత్తేపంటలు, తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులు, పొగాకు, మొక్కజొన్న సాగు విస్తరణపై రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయశాఖ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పొగాకు, మొక్కజొన్న సాగు చేయాలని అనుకునే రైతులు ప్రాథమిక దశలో మేలైన వంగడాలను ఎంచుకోవాలన్నారు. అలానే కంపెనీలతో ముందస్తు ఒప్పందాలు పకడ్బందీగా చేసుకోవాలని సూచించారు. పత్తి,మిరపా,వరి, అపరాల సాగుకు ముందు పచ్చిరోట్టేగా జనుము, జీలుగులు దుక్కుల్లో వాడేలా రైతులకు అవగాహనపర్చాలని కోరారు. సేంద్రీయ ఎరువులను వాడేలా రైతులను ప్రోత్సహించాలని కోరారు. అలానే ప్రభుత్వం తరుపున రైతులకు అందించే విత్తనాలు, ఎరువులను సిద్దంగా ఉంచుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏడీ జగదీశ్వర్ రెడ్డి, మాచర్ల మండల ఏవో పాపకుమారి, వెల్దుర్తి మండల ఏవో గంగాధర్, రెంటచింతల ఏవో లక్ష్మారెడ్డి, దుర్గి మండల ఏవో అమీర్ రెడ్డి, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.



## మండల వ్యవసాయ అధికారిగా బాధ్యతలు చేపట్టిన రాగల విజయబాబు

**దుగ్గిరాల,మేజర్ న్యూస్:**

దుగ్గిరాల మండల వ్యవసాయ అధికారిగా రాగల విజయబాబు. సోమవారం బాధ్యతలను చేపట్టారు. రేపల్లె మండల వ్యవసాయ అధికారిగా పనిచేస్తు బదిలీల ప్రక్రియ.లో దుగ్గిరాలకు బదిలీ కాగా ఇక్కడ ఎం ఏ ఓ గా పనిచేసిన పి .శిరీష తాడేపల్లి మండలంనకు బదిలీ అయినట్లు తెలుస్తుంది. ఈ సందర్భంగా విజయబాబు వ్యవసాయ సిబ్బందితో మాట్లాడుతూ కౌలు రైతు కార్డులు, ఖరీదుకు సంబంధించిన వరి విత్తనాల కొరకు రైతు సేవ కేంద్రాలలోని విఏఏ లను సంప్రదించవలసింది కోరారు. అన్నదాత సుఖీభవ పథకం కొరకు రైతులందరూ ఈ కేవైసీ ని పూర్తి చేసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏ ఈ ఓ రమేష్ బాబు వి ఏ, లు తదితరులు పాల్గొన్నారు.



# 'జగన్ అంటే నమ్మకం చంద్రబాబు అంటే మోసం' పుస్తక ఆవిష్కరణ



**మంగళగిరి,మేజర్ న్యూస్:**

కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసిందని నియోజకవర్గ వైసీపీ ఇన్చార్జి దొంతిరెడ్డి వేమారెడ్డి అన్నారు. సోమవారం మంగళగిరి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జగన్ అంటే నమ్మకం... చంద్రబాబు అంటే మోసం... అనే పుస్తకాన్ని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వేమారెడ్డి మాట్లాడుతూ వైఎస్ఆర్సీపీ జాతీయ అధ్యక్షులు,మాజీ ముఖ్య మంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాలు మేరకు కూటమి ప్రభుత్వం ఏర్పాటై సంవత్సర కాల వ్యవధిలో హత్యలు, అఘాయిత్యాలు, ఆకృత్యాలు పెరిగిపోయాయని అన్నారు. సూపర్ సిక్స్ అమలు పేరుతో రాష్ట్ర ప్రజలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మోసం చేశారని అన్నారు. ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు మాట్లాడుతూ కూటమి ఏడాది పాలన వైఫల్యాలను , మోసాలను ఎండగడుతామని పేర్కొన్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించే వారిపై కేసులు పెడుతుందని ఆరోపించారు. వైసీపీ నాయకులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందని మండిపడ్డారు. అధికారం లోకి వచ్చిన ఏడాదిలో రూ. లక్షా 50 వేల కోట్ల అప్పులు చేసి ప్రజలకు ఒరగబెట్టిందేమి లేదని పేర్కొన్నారు. పేద ప్రజలను మోసం చేయడంతో చంద్ర బాబు దిట్ట అని విమర్శించారు. ఈ కార్యక్రమంలో దుగ్గిరాల మండల రూరల్ అధ్యక్షుడు తాడిబోయిన శివగోపయ్య, మంగళ గిరి మండల అధ్యక్షుడు నాలివెంకట కృష్ణ, మంగళగిరి పట్టణ అధ్యక్షులు ఆకురాతి రాజేష్ ,తాడేపల్లి రూరల్ అధ్యక్షుడు అమరా నాగయ్య, తాడేపల్లి పట్టణ ఉపాధ్యక్షులు వేల్పుల ఎలీషా, జిల్లా ఉపాధ్యక్షురాలు పచ్చల రత్నకుమారి, ప్రధాన కార్యదర్శి ఈదులుమూడి డేవిడ్ రాజు, జిల్లా ఆక్టివిటీ విభాగ అధ్యక్షులు మల్లవరపు సుధారాణి, జిల్లా దివ్యాంగుల అధ్యక్షుడు బొక్కా అగస్టీన్, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు మేడ వెంకటేశ్వరరావు, నియోజవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు కట్టె పోగు నాగభూషణం, బిసి సెల్ నియోజకవర్గ విభాగ అధ్యక్షు తాడి బోయిన సుబ్బారావు, వైయస్సార్ ట్రేడియన్ అధ్యక్షులు శ్రీనివాసు రాజు, మున్సిపల్ విభాగం అధ్యక్షులు సుబ్బురావు, బూత్ విభాగ అధ్యక్షులు దర్శి రమేష్,రైతు విభాగ అధ్యక్షులు రుక్మాంగారెడ్డి, సీనియర్ నాయకులు కృష్ణమూర్తి, మునగాల నాగమల్లేశ్వర రావు, దుగ్గిరాల నాయకులు సుభాని, ధనుంజయ్, మంగళగిరి పట్టణ మహిళా అధ్యక్షురాలు సంకే సునీత, ఇంటి లెక్చువల్ విభాగాధ్యక్షులు జంగా నాగిరెడ్డి సోషల్ మీడియా నియోజవర్గ విభాగ అధ్యక్షులు భీమిరెడ్డి శరణ్ కుమార్ రెడ్డి, గ్రీవెన్స్ విభాగ అధ్యక్షులు మల్లిఖార్జున్ రెడ్డి రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి ముదిగొండ ప్రకాష్, రాష్ట్ర చేనేత విభాగ కార్యదర్శి గంజి షణ్ముఖ, సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శి జావిద్ కార్యకర్తల, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థునులు విద్యపై దృష్టి పెట్టి లక్ష్యంతో కష్టపడి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి: చుండూరు భాస్కరరావు





**దుగ్గిరాల, మేజర్ న్యూస్ :**

దుగ్గిరాల గ్రామంలోని దుగ్గిరాల జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల ప్రాంగణంలో సోమవారం సావిత్రిబాయి పూలే విగ్రహాన్ని గ్రామానికి చెందిన పద్మ స్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు చుండూరు భాస్కరరావు సహకారంతో సావిత్రిబాయి పూలే విగ్రహాన్ని ఆవిష్కరించారు. పుట్టిన గ్రామానికి చదువుకున్న పాఠశాలకు తన వంతుగా సహకారం అందించాలని సదుద్దేశంతో గతంలో బాలికోన్నత పాఠశాలకు రెండు విగ్రహాలను చుండూరు భాస్కరరావు అందజేయడాన్ని పలువురు అభినందించారు. ముందుగా చదువుల తల్లి సరస్వతి విగ్రహం వద్ద అర్చకులు శ్రీనివాసరావు వేదమంత్రాలు నడుమ ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. తదుపరి పాఠశాల ప్రాంగ ణంలో ఉన్న సర్వేపల్లి రాధాకృష్ణ, ఏపీజే అబ్దుల్ కలాం, స్వామి వివేకానంద విగ్రహా లకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కొలకలూరు మాజీ సర్పంచ్ ప్రసాదం భాస్కరరావు జ్ఞాపకార్థం కుమారుడు ప్రసాదం సురేష్ ముందుకొచ్చి బాలికలందరూ చదువుకొని. ఉన్నత స్థితికి ఎదగాలనే సదుద్దేశంతో గత ఏడాది పదవ తరగతిలో 100% మార్కులు సాధించిన ఐదుగురు విద్యార్థులకు 2,200 నగదు ను ప్రోత్సాక బహుమతులను అందజేశారు.అదే విధంగా ఎన్.ఎం.ఎస్ లో ముగ్గురు విద్యార్థునులకు 5,000 రూపాయలు చొప్పున పారితోషకమును అంద జేశారు. విద్యార్థు నులకు నోటుబుక్స్, పెన్నులను పంపిణీ చేశారు .ఈ సందర్భంగా జరిగిన సభకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్ .శోభా దేవి అధ్యక్షత వహించగా ఫౌండేషన్ వ్యవస్థాపకులు చుండూరు భాస్కరరావు మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ,గత ఏడాది కంటే. అత్యధిక మార్కులు సాధించి పాఠశాలకు, పాఠశాలల్లో విద్యను బోధించే ఉపాధ్యాయులకు, దుగ్గిరాల గ్రామానికి మంచి పేరు తేవాల. నే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. పాఠశాల హెచ్ఎంఎస్ శోభా దేవి మాట్లాడుతూ గత రెండు ,మూడేళ్లుగా పాఠశాలలో విద్యార్థు నులు మండల స్థాయిలో అత్యధిక మార్కులు సాధించే దిశగా విద్యార్థు ను ల ను తీర్చి దిద్దుతున్నట్లు తెలిపారు. ఈ ఏడాది పాఠశాల నుండి పలువురు ఉపాధ్యాయులు బదిలీ అయినారని, బదిలీ స్థానంలో వివిధ పాఠశాల నుండి ఉపాధ్యాయులు పాఠశాలలో జాయిన్ అయినారని ,గతం కంటే ఈ ఏడాది కూడా మండల స్థాయిలో అత్యుత్తమ మార్కులు సాధించే దిశగా పాఠశాల ఉపాధ్యాయుల బృందం కృషి చేసేందుకు ఇప్పటినుం. డే ప్రణాళికను సిద్ధం చేశామని అన్నారు. ఈ కార్యక్రమంలో దోస్త్ అధ్యక్షులు మిక్కిలినేని గాంధీ, మండల ఎంఈఓ కాజా లక్ష్మీనారాయణ, విశ్రాంత ఉపాధ్యాయులు అప్పారావు, పీహెచ్సీ వైద్యులు ఎండి అబ్దుల్ రెహమాన్, పి.గణేష్,ప్రధానోపాధ్యాయులు ఎం ఏడుకొండలు, జయరత్నరాణి, పాఠశాల హెచ్ఎం ఎం .అన్నారావు, ఎస్ వి ఎల్ నారాయణ ,మీనాక్షి పాఠశాల లోని ఉపాధ్యాయులు, విద్యార్థు నులు తదితరులు పాల్గొన్నారు..

# టీబి ముక్తభారత్ అభియాన్ మనందరి బాధ్యత : డిప్యూటీ డియం, హెచ్ ఓ అన్నపూర్ణ




**తెనాలి, మేజర్ న్యూస్ :**

తెనాలి ప్రభుత్వ హాస్పటల్ లోని ఎం సి హెచ్ హాల్ లో ఏర్పాటు చేసిన టిబి ముక్తభారత్ అభియాన్ ఇంటెన్సీ ఫైడ్ క్యాంపెయిన్ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డిప్యూటీ డిఎం%డ%హెచ్ ఓ డాక్టర్ ఈరుగుల అన్నపూర్ణ మాట్లాడుతూ టీబి లేని సమాజ నిర్మాణ స్థాపనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు అయ్యేందుకు కృషి చేయాలని ఏఎన్ఎమ్స్ మరియు ఆశా కార్యకర్తలకు సూచించారు. తెనాలి టీబి యూనిట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ దేవరపల్లి సుభాష్ రమాదేవిమాట్లాడుతూ రాబోవు మూడు నాలుగు నెలలో విస్తృతంగా క్షయ వ్యాధిపై అవగాహన కల్పించి సర్వే నిర్వహించాల న్నారు. క్షయ వ్యాధిగ్రస్తుల కుటుంబ సభ్యులను ఈ విధంగా అర్హులైన ప్రతి ఒక్కరిని స్క్రీనింగ్ చేసి క్షయ వ్యాధి లక్షణాలుల ఉన్న ప్రతి ఒక్కరికి పరీక్షలు చేయాలని సూచించారు. తెనాలి ప్రభుత్వ హాస్పటల్ ఆర్ ఏం ఓ డాక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ ప్రభుత్వ హాస్పటల్ నందు అధునాతన టీబి టెస్ట్ పరికరం అందుబాటులో ఉందని తెలిపారు. అలాగునే డిజిటల్ ఎక్స్ రే కూడా అందుబాటులో ఉందని అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. తెనాలి పట్టణంలోని యు పి హెచ్ సి పరిధిలో పనిచేస్తున్న మెడికల్ ఆఫీసర్స్ డాక్టర్ వేముల ప్రియాంక, రక్షిత్, హనోక్ మాట్లాడుతూ ప్రతి ఏఎన్ఎం మరియు ఆశా కార్యకర్త జన్ భాగీరథ కార్యక్రమంలో పాల్గొని కీలక పాత్ర పోషించి, హాస్టల్స్ లో, వృద్ధుల ఆశ్రమాలలో, నైట్ షెల్టర్ లలో, వర్క్ ప్లేస్ లలో క్షయవ్యాధిపై అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం డిప్యూటీ డిఎంహెచ్ ,ఆర్ఎంఓ డాక్టర్ మల్లికార్జునరావు, టీబీ యూనిట్ మెడికల్ ఆఫీసర్, యూపీ హెచ్ సీ డాక్టర్ల చేతుల మీదుగా క్షయ వ్యాధి లక్షణాలు సంబంధించిన గోడపత్రికలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో తెనాలి టీబి యూనిట్ సూపర్వైజర్ పల్లికొండ రవికుమార్ మాట్లాడుతూ క్షయ వ్యాధి లేని తెనాలి పట్టణమే మన ధ్యేయమని తెలిపారు. కార్యక్రమంలో ల్యాబ్ సూపర్వైజర్ లక్ష్మీ, టీబీ హెచ్ వి లు దిలీప్, భార్గవి పట్టణంలోని యుపిహెచ్ సి పరిధిలో పనిచేస్తున్న హెల్త్ విజిటర్స్ పాగోలు వెంకటేశ్వరమ్మ, దాసరి విజయకుమారి, చింతల ప్రసన్న పుష్పలత యు పి హెచ్ సి పరిధిలో పనిచేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్స్, ఏఎన్ఎమ్స్ ఆశా కార్యకర్తలుపాల్గొన్నారు.

# హరిత మాచర్లకు సహకరించండి

## - ప్రతి ఒక్కరు చెట్లు నాటండి... - ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి



**మాచర్ల మేజర్ న్యూస్:-**

హరిత మాచర్లకు ప్రతిఒక్కరూ సహకరించాలని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పేర్కొన్నారు. వన మహోత్సవం సందర్భంగా సోమవారం స్థానిక మున్సిపల్ రోడ్డులో ఓ ప్రైవేటు పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులతో కలిసి ఎమ్మెల్యే మొక్కలు నాటారు. హరిత మాచర్ల .. స్వచ్ఛ మాచర్లకు ప్రజలు, అధికారులు తమవంతు పాత్ర పోషించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వేణుబాబు పాల్గొన్నారు.

# చిన్నారిని ఆశీర్వదించిన డాక్టర్ అశోక్ కుమార్



**మాచవరం, మేజర్ న్యూస్:** గురజాల నియోజకవర్గం లోని మాచవరం మండలం గంగిరెడ్డిపాలెం గ్రామం నందు ముండ్లపాటి వారి పుష్పాలంకరణ కార్యక్రమంలో పాల్గొని చిన్నారిని ఆశీర్వదించిన వైయస్ఆర్ సీపీ రాష్ట్ర వైద్యుల విభాగం అధికార ప్రతినిధి డా. చింతల పూడి అశోక్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి పేదవాడికి వినుకొండ పట్టణంలో రెండు సెంట్లు ఇంటి స్థలం ఇంటి నిర్మాణానికి ఐదు లక్షలు ఇవ్వాలి

వినుకొండ మేజర్ న్యూస్ :

భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ వినుకొండ పట్టణ కార్యదర్శి ఉలవలపూడి రాము కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ 17వ వార్డు కొండమెట్ల బజార్లోని అర్హులైన పేదలకు రెండు సెంట్లు ఇంటి స్థలం . ఇంటి నిర్మాణానికి 5 లక్షల రూపాయలు ఇవ్వాలని ఓబయ్య కాలనీ సచివాలయం వద్ద నిరసన కార్యక్రమాన్ని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ వినుకొండ పట్టణ సమితి ఆధ్వర్యంలో పేద ప్రజలతో కలిసి నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి. చెన్నకేశవులు. దేవరాజు అధ్యక్షత వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిపిఐ వినుకొండ పట్టణ కార్యదర్శి ఉలవలపూడి రాము పాల్గొని ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తూ గత ప్రభుత్వం మన రాష్ట్రంలో 32 లక్షల ఇళ్ల స్థలాలను పేద ప్రజలకు ఇచ్చామని ఇంటి నిర్మాణానికి 1,80,000 రుణాన్ని ఇప్పించామని లక్షలాది ఇళ్లను నిర్మించామని చెప్పడం జరిగింది. అయితే అప్పటి ప్రతిపక్ష నాయకులు నారా చంద్రబాబు నాయుడు గారు అనేకసార్లు బహిరంగ సభలో ఎన్నికల ప్రచారంలో . పట్నంలో ఒక సెంటు రూరల్ లో మూడు సెంట్లు ఇంటి నిర్మాణానికి 1,80,000 మా పార్టీ అధికారంలోకి వస్తే పట్టణాల్లో రెండు సెంట్లు ఇంటి నిర్మాణానికి నాలుగు లక్షల



రూపాయలు ఇస్తామని అనేకసార్లు చెప్పి ప్రతిపక్షం పైన అనేక విమర్శలు చేసి ఉన్నారు ఎన్నికల్లో ప్రజలందరూ కూటమి పార్టీ వైపు మొగ్గుచూపి గతంలో ఎప్పుడు రానంత మెజార్టీతో ఎప్పుడు రానని సీట్లను కూటమి ప్రభుత్వానికి ప్రజలు ఇవ్వడం జరిగింది అయితే కూటమి ప్రభుత్వం పరిపాలనలోకి వచ్చి ఏడాది ఆయన సందర్భంగా ప్రజలు తమ సొంత ఇంటి కలను నెరవేర్చాలని కూటమి ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేస్తున్నారు పట్నంలో రెండు సెంట్లు ఇంటి స్థలం ఇచ్చి ఇంటి నిర్మాణానికి 5 లక్షల రూపాయలు ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారని . అర్హులైన వారందరికీకొత్త రేషన్ కార్డులు వితంతు వికలాంగుల ఒంటరి మహిళ పెన్షన్లను ఇవ్వాలని. గత ప్రభుత్వం. ఇచ్చిన ఇంటి స్థలాలు వాగుల్లో స్మశానాల పక్కన ఇచ్చారని వాటిని రద్దుచేసి నివాసయోగ్యమైన ఇంటి స్థలాలను ఇవ్వాలని ప్రజలు కూటమి ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారని వెంటనే కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకొని పట్టణాల్లో రెండు సెంట్లు ఇంటి నిర్మాణానికి 5 లక్షల రూపాయలు ఇవ్వాలని రాము కూటమి ప్రభుత్వాన్ని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. అనంతరం ఓబయ్య కాలనీ సచివాలయం అడ్మిన్ ఏడుకొండలకు ప్రజలు అర్జీలు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఐ 17వ వార్డు శాఖ కార్యదర్శి జె చెన్నకేశవులు బి దేవరాజు. కుమారి మేరీ లక్ష్మి అరుణ విజయ రాణి పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

## కలెక్టర్‌కు చౌడవరం బాధితులు ఫిర్యాదు

గుంటూరు జిల్లా క్రైం, మేజర్ న్యూస్:

నల్లపాడు జిడిసిసి బ్యాంకులో ఫేక్ అకౌంట్లో సృష్టించి తమకు తెలియకుండా రుణాలు పొందారని చౌడవరానికి చెందిన డ్వాక్రా మహిళలు ఆందోళన వ్యక్తం చేశారు. కలెక్టర్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా డ్వాక్రా గ్రూపులో కొనసాగుతున్నామని చెప్పారు. ఏటుకూరులోని గోదావరి చైతన్య గ్రామీణ బ్యాంకులో తమకు డ్వాక్రా ఎకౌంట్లో ఉన్నాయని తెలిపారు. తమ యానిమేటర్ కంచర్ల భవ్యశ్రీ 2021 నుండి 2023 మధ్య తమకు అనుకూలమైన వారిని డ్వాక్రా గ్రూపులో చేర్చి ఈ స్కామ్ కు పాల్పడిందని చెప్పారు. మా డేటాను దొంగిలించి నల్లపాడు జీడీసిసి బ్యాంకులో నాలుగు కోట్ల 30 లక్షలు రుణాలు తీసుకున్నారని తెలిపారు. రికవరీ ఆఫీసర్ సత్యవతి ద్వారా విషయం తెలిసిందని తెలిపారు. మాకు తెలియకుండా మా పేరులతో కోట్ల రూపాయల రుణాలు తీసుకున్న వారిని గుర్తించి రికవరీ చేసి శిక్షించాలని డిమాండ్ చేశారు.

## త్రికోటేశుని దర్శించుకున్న ఎమ్మెల్యే అరవిందబాబు





నరసరావుపేట రూరల్, మేజర్ న్యూస్:

కోటప్పకొండపై వేంచేసియున్న త్రికోటేశ్వర స్వామి వారిని నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు వేద పండితులు పూర్ణ కుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. అర్చకులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అభిషేకాలు చేసి, స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం కొండపై పారిశుద్ధ్యం, తాగునీరు తదితర మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. ఉద్యోగుల పనితీరుపై భక్తులను అడిగి తెలుసుకున్నారు. కొండపై ఉండే సిబ్బంది భక్తిశ్రద్ధలతో సేవలందించాలని సూచించారు. ఎమ్మెల్యే వెంట కూటమి నాయకులు, పార్టీ కార్యకర్తలు ఉన్నారు.

## మెడికేర్ ల్యాబ్‌ని ప్రారంభించిన కన్నా

సత్తెనపల్లి, మేజర్ న్యూస్:

పట్టణం, ఎన్టీఆర్ భవన్ పక్కన నూతనంగా ఏర్పాటు చేసిన మెడికేర్ ల్యాబ్ ని సత్తెనపల్లి నియోజకవర్గ శాసన సభ్యులు కన్నా లక్ష్మీ నారాయణ, టిడిపి నాయకులు యాగంటి మల్లికార్జునరావు, పోట్ల అరుణ కుమారి, యెలినేడి రామస్వామి, దరువూరి నాగేశ్వరావు సోమవారం



లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో పాల్గొన్న అతిథులను ల్యాబ్ నిర్వాహకులు సయ్యద్ పెద కరిముల్లా, మొహమ్మద్ ఆబిద్ రోషన్ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వివిధ హోదాల్లో ఉన్న రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, పట్టణ, మండల నాయకులు పాల్గొన్నారు.

## పేద విద్యార్థులను ఆదుకోవాలి

చల్లావారిపాలెం(గుంటూరు) మేజర్ న్యూస్: సమాజంలోని ప్రతి ఒక్కరూ పేద విద్యార్థులను ఆదుకోవాలని చల్లావారిపాలెం జనసేన పార్టీ గ్రామ అధ్యక్షులు సూదా పిచ్చయ్య, టిడిపి అధ్యక్షులు సూరిశెట్టి హరీష్ కోరారు. ఇటీవల కూటమి ప్రభుత్వం పాఠశాల విద్యార్థులకు టెక్స్ట్ పుస్తకాలు, బ్యాగులను ఉచితంగా అందించింది. నోటు పుస్తకాలు కొరతతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న కూటమి నాయకులు పెద్ద మనసుతో స్పందించారు. సుమారు రూ. 20వేల విలువైన నోటు పుస్తకాలను విద్యార్థులకు ఉదారంగా అందజేశారు. ఈ సందర్భంగా కూటమి నాయకులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కొటారి శ్రీనివాసరావు, నాగభూషణం, తిమ్మిశెట్టి శంకర్, జగన్, సురేష్, రాముడు తదితరులు పాల్గొన్నారు.



# అమ్మవడి పేద విద్యార్థులకు వరం

మల్లవరం(గుంటూరు రూరల్), మేజర్ న్యూస్: కూటమి ప్రభుత్వం చేపట్టిన అమ్మ ఒడి కార్యక్రమం పేద విద్యార్థులకు ఒక వరం అని పలువురు కూటమి నాయకులు ప్రశంసించారు. గుంటూరు రూరల్ మండలం మల్లవరం గ్రామ పాఠశాల్లో సోమవారం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చిత్ర పటాలకు పాలాభిషేకం కార్యక్రమం జరిగింది. ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులుఆధ్వర్యంలో మల్లవరం కూటమి నాయకులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వం తల్లికి వందనం కార్యక్రమాన్ని విజయ వంతంగా నిర్వహించినందుకు ఈ వేడుకలు జరిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వం తరపున బ్యాగులు నోటు పుస్తకాలను అందించారు. కార్యక్రమం లో రాష్ట్ర టిఎన్ఎస్ఎఫ్ కార్యదర్శి కే ధర్మతేజ, గుంటూరు రూరల్ మండలం టిడిపి పార్టీ ఉపాధ్యక్షుడు తెల్ల మేకల రమేష్, స్కూల్ చైర్మన్ సంకు కృష్ణారావు, మల్లవరం గ్రామ పార్టీ అధ్యక్షులు దుద్దుకూరు వీరాంజనేయులు, తెల్ల మేకల శ్రీనివాసరావు, యూనిట్ ఇన్చార్జి తలకోలా రామకృష్ణారెడ్డి, మరియు తోకవారి పాలెం గ్రామం పార్టీ అధ్యక్షులు ఆల శివ నారాయణ, 40 డివిజన్ అధ్యక్షులు షేక్ అహ్మద్, గుంటూరు రూరల్ మండలం బీసీ సెల్ కార్యదర్శి తెల్ల మేకల సాంబశివరావు, మల్లవరం గ్రామ పార్టీ ఉపాధ్యక్షులు తలకోన శ్రీనివాస్ రెడ్డి, మల్లవరం స్కూల్ హెచ్ఎం, పంచాయతీ కార్యదర్శి, సచివాలయం స్టాఫ్ మల్లవరం గ్రామంలోని తెలుగుదేశం కార్యకర్తలు మరియు జనసేన, బిజెపి కూటమి నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# ప్రభుత్వ డిగ్రీ కాలేజీ స్థలాన్ని రక్షించాలని గ్రీవెన్స్ లో ఫిర్యాదు చేసిన విద్యార్థి సంఘ నాయకులు

వినుకొండ మేజర్ న్యూస్

గంగినేని కళ్యాణి ప్రభుత్వ డిగ్రీ కళాశాల (వినుకొండ) భూమిని కొందరు రాజకీయ అండదండలతో స్వాహా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, వెంటనే చర్యలు తీసుకొని డిగ్రీ కాలేజీ స్థలాన్ని పరిరక్షించాలంటూ విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థులు సోమవారం పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. 38 ఎకరాల ప్రభుత్వ డిగ్రీ కాలేజీ భూమిలో 5.10 ఎకరాల భూమికి రెవెన్యూ రికార్డులు మార్చి కాజేస్తున్నారని, ప్రభుత్వాన్ని నిషేధిత భూముల జాబితా 22లో సర్వే నెంబర్ 949 డిగ్రీ కాలేజీ భూమిక నమోదు కాగా, 949/1,949/2 సబ్ డివిజన్లో DK పట్టాగా నమోదు అయింది. ప్రస్తుతం రెవెన్యూ అధికారులు 1B, అడంగల్ లో కొనుగోలుగా నమోదు చేశారు. 2021లో అప్పటి ఎమ్మెల్యే బోల్లా బ్రహ్మనాయుడు అనుచరులు డిగ్రీ కాలేజీ భూమిని స్వాహా చేసేందుకు ప్రయత్నించారు. కాలేజీ ఉద్యోగులు, విద్యార్థులు, విద్యార్థి సంఘ నాయకులు ప్రతిఘటించి అడ్డుకోవడమే కాకుండా



విద్యార్థులు పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేశారు. అప్పటి కలెక్టర్ శివ శంకర్ లో తేటి స్పందించి కాలేజీలు సందర్శించి రెవిన్యూ రికార్డులు పరిశీలించారు. డిగ్రీ కాలేజీ 38 ఎకరాలు ఉందని తేల్చి చెప్పారు. కాలేజీ భూమిని కాపాడుకునేందుకు విద్యార్థి సంఘ నాయకుడు మహంకాళి సుబ్బారావు, సాగర్ లు హైకోర్టును ఆశ్రయించగా స్టే ఇవ్వటం జరిగింది. అయ్యర్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపల్ కమిషనర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ స్థలం 38 ఎకరాలని హైకోర్టుకు నివేదిక కూడా ఇచ్చారు. కాలేజీ స్థలాన్ని సంబంధిత అధికారులు విచారించి నిగ్గు తేల్చి నివేదించాల్సిందిగా హైకోర్టు ఆదేశించారు. అయితే అమాజీ ఎమ్మెల్యేతో కొమ్మక్కైన డివిజన్, మండల రెవెన్యూ అధికారులు కలిసి 22 జాబితాలో ఉన్న డిగ్రీ కాలేజీ భూమికి ఏకంగా కొనుగోలుగా నమోదు చేసి అక్రమదారులకు క్రయవిక్రయాలు జరుపుకునే అవకాశాన్ని కల్పించారు. దీనిపై గ్రీవెన్స్ లో విద్యార్థులు, విద్యార్థి సంఘ నాయకులు ఫిర్యాదు చేయగా వినతి పత్రాన్ని స్వీకరించిన నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ భూమి, 22(A) జాబితాలో ఉన్న భూమికి రెవిన్యూ అధికారులు కొనుగోలుగా ఎలా నమోదు చేశారంటూ ఆశ్చర్యపోయారు. ప్రభుత్వ డిగ్రీ కాలేజీ భూమిని కాపాడాలని విద్యార్థుల విద్యార్థి సంఘ నాయకులు కలెక్టరేట్ వద్ద మోకాళ్లపై నిరసన కార్యక్రమం చేపట్టారు.

# ప్రజల నుండి అర్జీలు స్వీకరించిన ఎస్పీ కంచి శ్రీనివాసరావు

పల్నాడు జిల్లా క్రైమ్ న్యూస్ :-

ఈ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుండి కుటుంబ, ఆర్థిక,ఆస్తి తగాదాలు,మోసం మొదలగు ఆయా సమస్యలకు సంబంధించి 81 ఫిర్యాదులు అందాయి.ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా వచ్చిన ఫిర్యాదులకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి త్వరితగతిన పరిష్కరించే విధంగా తక్షణ చర్యలు చేపట్టాలని, ప్రతి ఫిర్యాదుదారుని సమస్య పట్ల శ్రద్ధ వహించి, నిర్ణీత గడువులోగా సదరు ఫిర్యాదులను పరిష్కరించడానికి కృషి చేయాలని ఎస్పీ సూచించారు. రాజుపాలెం మండలం కోట నెమలిపురి గ్రామానికి చెందిన సరికొండ శివ రంగనాయకుల రాజు పిడుగురాళ్ల కు చెందిన జానీ మస్తాన్ అను రియల్ ఎస్టేట్ బ్రోకర్ల ద్వారా పిడుగురాళ్లలోని ఎరపతి నగర్ కరాలపాడు గ్రామానికి చెందిన మడేల శ్రీనివాసరెడ్డి అనే అతనికి చెందిన 3 1/2 సెంట్ల లో గల డాబా యింటిని 33,00,000/- రూపాయల కు మాట్లాడుకున్నట్లు, విడతల వారీగా శ్రీనివాస్ రెడ్డికి 20,30,000/- లు ఇచ్చి అతని చే స్వాధీన అగ్రిమెంట్ రాయించుకున్నట్లు,వ్రాయించుకున్న తరువాత సదరు స్థలంలో గల ఇంటికి మడేల శ్రీనివాస్ రెడ్డి పేరు పై ఎలాంటి రిజిస్ట్రేషన్ పత్రాలు లేవు అని తెలిసి పెద్ద మనుషుల సమక్షంలో పంచాయతీ మాట్లాడుకొనగా ఫిర్యాదుకు డబ్బులు ఇస్తానని వాయిదాలు పెట్టి అనేకసార్లు ఇవ్వకుండా వేధించినట్లు, మడేల శ్రీనివాసరెడ్డి భార్య అయిన రాధిక ఫిర్యాదుతో "మేము నీకు డబ్బులు ఇవ్వము నీ దిక్కున చోట చెప్పుకో" అని దూషించి నేను ఎస్సీ కులానికి చెందిన దానిని నీపై ఎస్సీ ఎస్టీ కేసు పెడతానని,నన్ను బలాత్కారం చేయబోయాడని రేప్ కేసు పెడతానని బెదిరిస్తున్నట్లు, కుట్రపూరితంగా



తప్పుడు పత్రాలు చూపించి మోసం చేసినందుకు గాను మడేల శ్రీనివాసరెడ్డి మరియు అతని భార్య రాధిక పై చట్టపరమైన తీసుకోవలసిందిగా ఎస్పీ ని కలిసి ఫిర్యాది అర్జీ ఇవ్వడం జరిగిందినకరికల్లు మండలం చల్లగుండ్ల గ్రామానికి చెందిన చిలుకా రాజు ఇంటర్మీడియట్ పూర్తి చేసినట్లు, ఫిర్యాదికి తన స్నేహితుడైన అనిల్ కుమార్ ద్వారా మాన్ పవర్ ఏజెన్సీ, ముంబై అతను పరిచయమైనట్లు, ఆ పరిచయం మీద రాజీబ్ వారితో ఫిర్యాదిని మరియు అతని స్నేహితుడైన సునీల్ కుమార్ ను రష్యాకు పంపుతానని, తనకు మాన్ పవర్ సప్లై చేసే ఏజెన్సీ ఉన్నదని వర్కింగ్ ఇప్పిస్తానని నమ్మపలకగా ఫిర్యాదు అతని మాటలు నమ్మి వీసా కొరకు రెండు లక్షలు ఇచ్చినట్లు, అయితే ఫిర్యాదికి మరియు అతని స్నేహితుడైన సునీల్ కుమార్ కు వీసా వచ్చిందని చెప్పగా రాజీబ్ మాటలు నమ్మి ఫిర్యాది మరియు అతని స్నేహితుడు ది.26.03.2025న ముంబైకు వెళ్ళినట్లు, సదరు రాజీబ్ ఫేక్ ఫ్లైట్ టికెట్ బుక్ చేసి వారి సెల్ కు పంపగా ఫిర్యాదు మరియు అతని స్నేహితుడు ఎయిర్ పోర్ట్ లో టికెట్ చూపించగా అది ఫేక్ టికెట్ అని బయటకు గెంటి వేసినట్లు, తదుపరి ఎన్నిసార్లు రాజీబ్ కు ఫోన్ చేసినను సమాధానం చెప్పకుండా విదేశాలకు పంపుతానని మోసం చేసినందుకు గాను న్యాయం కొరకు ఎస్పీ ని కలిసి ఫిర్యాదు ఇవ్వడం జరిగింది. దాచేపల్లి మండలం రామాపురం గ్రామానికి చెందిన వేముల సుమలత తల్లిదండ్రులకు ముగ్గురు ఆడ పిల్లలు సంతానం. ఫిర్యాది తల్లి చనిపోగా ఫిర్యాది తండ్రి అయిన బూసి వెంకటరెడ్డి రెండవ వివాహం చేసుకున్నట్లు, వారికి సంతానం కలగనట్లు, ఫిర్యాదు తండ్రికి వెల్దుర్తి మండలంలోని మండాది గ్రామంలో రైస్ మిల్ మరియు డాబా ఇల్లు, ఖాళీ స్థలం ఉన్నట్లు వివాహ సమయంలో ఫిర్యాదికి ఇస్తాను అన్న వాటా పంపిణి చేయకుండా ఫిర్యాదుకు సంబంధించిన 25 సెంట్లు భూమిని రిజిస్ట్రేషన్ చేసి నప్పటికినీ దానికి సంబంధించిన 1బి, అడంగల్, పట్టాదార్ పాస్ బుక్ అతని వద్దనే పెట్టుకుని ఇబ్బందులకు గురి చేస్తున్నందుకు గాను తగిన న్యాయం కొరకు ఎస్పీ ని కలిసి ఫిర్యాదు చేయడం జరిగింది. రెంటచింతల మండలం పాలువాయి గ్రామానికి చెందిన తమ్మిశెట్టి ఉమామహేశ్వరి అను ఆమెకు ఒక సంవత్సరం క్రితం పెండ్లి జరిపించినట్లు, వివాహం అనంతరం ఒక పాప జన్మించినట్లు, ఆడపిల్ల పుట్టడం ఇష్టం లేని భర్త అయిన తమ్మిశెట్టి గురవయ్య తమ్మిశెట్టి దాసు (మామ) తమ్మిశెట్టి రమాదేవి (అత్త) ముగ్గురు కలిసి కొట్టి హింసిస్తున్నట్లు, వరకట్నం తీసుకురావాల్సిందిగా వేధిస్తున్నం దుకుగాను ఈ రోజు ఎస్పీని కలిసి అర్జీ ఇవ్వడం జరిగింది.బొల్లాపల్లి మండలం చక్రాయపాలెం గ్రామానికి చెందినటువంటి కేతావత్ సూర్య నాయక్ కు అదే గ్రామానికి చెందిన గతంలో లైన్ మెన్ గా పని చేస్తూ ప్రస్తుతం నరసరావు పేట లో పని చేయుచున్న మూడవత్ బాబు నాయక్ అను అతను ఫిర్యాదికి మరియు బాణావత్ రంజానాయక్ నకు పొలం మోటర్లు ఇప్పిస్తాను అని 1,90,000 తీసుకుని మోటర్లు ఇప్పించకుండా ఇబ్బంది పెడుతున్నందుకు గాను తగిన చర్యలు తీసుకొని న్యాయం చేయవలసిందిగా ఎస్పీ ని కలిసి అర్జీ ఇవ్వడం జరిగింది.ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ప్రజలకు వారి ఫిర్యాదులను రాసి పెట్టడంలో పోలీస్ సిబ్బంది సహాయ సహాయ సహకారాలు అందించారు.

## ఫిజియోథెరపీ క్యాంపును సద్వినియోగం చేసుకోండి

- ఎంఈఓ శ్రీనివాసరావు.



సత్తెనపల్లి మేజర్ న్యూస్: పట్టణంలోని భవిత కేంద్రం ప్రతి సోమవారం జరిగే ఫిజియోథెరపీ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ ఏ శ్రీనివాసరావు సూచించారు. పట్టణంలోని వెంగల్ రెడ్డి నగర్ లో ఉన్న భవిత కేంద్రము నందు ప్రతి సోమవారము జరిగేటువంటి ఫిజియో తెరపి క్యాంపులో భాగంగా సోమవారం క్యాంపు నిర్వహించారు. ఈ ఫిజియోథెరపీ క్యాంపునకు సత్తెనపల్లి మండలం, మున్సిపల్ పరిధిలో ఉన్నటువంటి ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలు హాజరవడం జరిగింది. ఈ క్యాంపును స్థానిక మండల విద్యాశాఖ అధికారులు ఏ శ్రీనివాసరావు, రాఘవేంద్ర రావు విజిట్ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఏ శ్రీనివాసరావు మాట్లాడుతూ పిల్లలను ప్రతి సోమవారం జరిగేటటువంటి ఫిజియోథెరపీ క్యాంపు కు తీసుకొని వచ్చి వారి సేవలు వినియోగించుకోవలసిందిగా కోరారు. అంతేకాకుండా మండల పరిధిలో ఉన్నటువంటి ఫిజియో థెరపీ, వినికిడి లోపము, ఆటిజం, ఏడి హెచ్డి మొదలైనటువంటి ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలు భవితా కేంద్రం యొక్క సేవలను వినియోగించుకోవలన్నారు. ఈ క్యాంపులో భవిత కేంద్రం రిసోర్స్ టీచర్స్ ఏవి శ్రీనివాస్, విజయ్ కుమారి, టీచర్ ఫిజియోథెరపీ డాక్టర్ కే కుమారి, బెల్లంకొండ నాగ సాయి ప్రసాద్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## నగల దొంగతనం కేసులలో జైలు శిక్ష

తెనాలి, మేజర్ న్యూస్

కొల్లిపర మండలం హనుమాన్ పాలెం గ్రామానికి చెందిన మర్రి వెంకయ్య అలియాస్ వెంకటేశ్వర్లుకు దొంగతనం నేరం నిరూపణ అయినందువల్ల తెనాలి తెనాలి రెండవ అదనపు మున్సిఫ్ మెజిస్ట్రేట్ బి రాజశేఖర్ ఆరు నెలలు జైలు శిక్ష విధించారు. వివరాల్లోకి వెళితే 2021 ఆగస్టు కొల్లూరు శివాలయం వీధి నివాసి నంబూరి మధుసూదన్ రావు కొత్త ఇంటిని నిర్మించుకుని అదే రోజు రాత్రి 11 గంటలకు గృహప్రవేశం చేసి ఇంటిలో పూజలు ముగించి బంధువులతో ఆరోజు రాత్రి ఆ ఇంట్లో నిద్ర పోయియారు. ఆయన అక్క అయిన పొన్నూరు కి చెందిన సంకాల లక్ష్మీ సుకన్య కూడా హాజరయ్యారు. ఆమె తన నగలను బ్యాగులో పెట్టి కుర్చీలో ఉంచి నిద్రపోయింది. తెల్లవారు జామున ఐదు గంటలకి నిద్రలేచి చూడగా బ్యాగ్ తో పాటు నగలను ఎవరో గుర్తు తెలియని దొంగలు దొంగరించినారు. ఈ విషయాన్ని కొల్లూరు పోలీస్ స్టేషన్ లో రిపోర్ట్ ఇవ్వగా అప్పటికి యస్ యస్. ఐ ఉజ్వల్ కుమార్ కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు. 2021 లోనే హనుమాన్ పాలెం కరకట్ట దగ్గర ఎస్ ఐ యు శ్రీనివాసరావు ముద్దాయన మర్రి వెంకయ్యను అరెస్ట్ చేసి రూ. 7.40 లక్షల విలువైన సుకన్య కి చెందిన నగల్ని స్వాధీనం చేసుకుని కోర్టు హాజరు పరిచారు. అప్పటి తెనాలి రూరల్ ఇన్స్పెక్టర్ ఎం. సుబ్రహ్మణ్యం కోర్టులో చార్జిషీటు దాఖలు చేసినారు. కేసు విచారణలో ముద్దాయి మీద నేరం రుజువు అయినందువలన తెనాలి రెండవ అదనపు మన్సిఫ్ మేజిస్ట్రేట్ బి. రాజశేఖర్ ముద్దాయి కి ఆరు నెలలు జైలు శిక్ష విధించారు. ఈ కేసులో సీనియర్ ఏపీపి పరిశపోగు సునీల్ కుమార్ ప్రాసిక్యూషన్ నిర్వహించారు. కోర్టు కానిస్టేబుల్ మల్లేశ్వరరావు సహకరించారు.

## ఆర్థిక ఇబ్బందులతో రైలు కింద పడి ఆత్మహత్య

తెనాలి, మేజర్ న్యూస్

ఆర్థిక ఇబ్బందులతో ప్రయివేటు ఉద్యోగి రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జీఆర్పీ పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ చినరావూరుకు చెందిన యడ్ల నాగవెంకట మల్లేశ్వర రావు(46) బీఎస్ఎన్ఎల్‌లో ప్రయివేటు ఉద్యోగం చేస్తున్నాడు. ఆదివారం రాత్రి ఇంటి నుండి వెళ్లి తిరిగి రాలేదు.



సోమవారం ఉదయం వైకుంఠపురం నుండి చినరావూరు స్టేషన్ మధ్య పట్టాలపై అతడి మతదేహాన్ని స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న జీఆర్పీ పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్టు పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వెంకటాద్రిబాబు తెలిపారు. మతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

## సూపర్ సిక్స్‌లోని ప్రతి పథకాన్ని అమలు చేస్తాం

- ప్రభుత్వం చేసే మంచిని ప్రక్కతోవ పట్టించేందుకు ప్రతిపక్షం పనిచేస్తోంది
- విలేకరుల సమావేశంలో టిడిపి ఫ్లోర్ లీడర్, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు



**నరసరావుపేట, మేజర్ న్యూస్ :** ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్ లోని ప్రతి పథకాన్ని కూటమి ప్రభుత్వం అమలు చేస్తోందని.. టిడిపి ఫ్లోర్ లీడర్, నర్సరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు సోమవారం వెల్లడించారు. ప్రభుత్వం చేసే ప్రతి మంచి కార్యక్రమాన్ని ప్రక్కతోవ పట్టించేందుకు ప్రతిపక్షం పనిచేస్తూ..తమ అక్కసుని వెళ్లగక్కుతుందని, దీన్ని ప్రజలు కూడా గమనిస్తున్నారని, ఎన్ని అసత్య ఆరోపణలు చేసినా తిప్పి కొట్టడానికి పాలక పక్షం సిద్ధంగా ఉందని ఎంపీ స్పష్టం చేశారు. నరసరావుపేటలోని, కలెక్టరేట్లో మీడియా సమావేశం నిర్వహించారు. ఇచ్చిన మాట ప్రకారం కూటమి ప్రభుత్వం పారదర్శకంగా తల్లికి వందనం పథకాన్ని అమలు చేసిందని, కుటుంబంలో అర్హులైన ప్రతి పిల్లవానికి రూ. 13, వేల చొప్పున అందించామని తెలిపారు. మరో రూ. 2. వేలను . స్కూల్ మెయిన్ టెన్స్ కోసం తీసుకొని వాటిని విద్యార్థులపైనే ఖర్చు చేస్తున్నామని తెలిపారు. ఈ పథకంపై ప్రతిపక్షం విషం చిమ్ముతూ.. చేసిన ఆరోపణలకు మంత్రి నారా లోకేష్ చేసిన చాలెంజ్ ను నిరూపించుకోలేక తోకముడిచారని విమర్శించారు. తల్లికి వందనం పథకం అమలుతో రాష్ట్రంలోని తల్లులందరు సంతోషంగా ఉన్నారని, అలాగే అన్నదాత సుఖీభవ పథకం నిధులు కూడా సమయానికి ఇచ్చేస్తామని తెలిపారు. పొగాకు విషయంలో అమ్మకం జరగలేదంటూ అలజడులు సృష్టించారని.. కేవలం అవినీతి ఆరోపణలు చేయడం గందరగోళ వాతావరణం సృష్టించడమే ప్రతిపక్షాల ఏజెండాగా మారిపోయిందని విమర్శించారు. కేంద్రమంత్రి పీయూష్ గోయల్ కూడా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుని కలిసారని, ప్రజలకు మేలు చేయడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.

## విజ్ఞాన్స్ విద్యార్థికి పీహెచ్‌డీ



**చేబ్రోలు, మేజర్ న్యూస్ :** చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని స్కూల్ ఆఫ్ అప్లైడ్ సైన్స్ అండ్ హ్యూమానిటీస్ విభాగంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ కెమిస్ట్రీ విభాగానికి చెందిన పగడాల ఈశ్వర్ అనే విద్యార్థికి విజ్ఞాన్స్ యూనివర్సిటీ సోమవారం పీహెచ్‌డీ పట్టా అందజేసిందని యూనివర్సిటీ వైస్ చాన్సలర్, కల్నల్ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ " ఎక్స్‌ప్లోరేషన్ అయాన్ - డ్రివెన్ కోఆర్డినేషన్ ఫీచర్స్ ఆఫ్ స్కిఫ్స్ బేస్ లిగాండ్స్ డిరైవ్డ్ ఫ్రమ్ హెటిరోసైకిల్స్ - అప్లికేషన్స్ టువర్డ్స్ ఆర్‌వోపీ అండ్ మెటల్ అయాన్ సెన్సార్స్ " అనే అంశంపై విద్యార్థి పరిశోధన చేశారని తెలిపారు. ఈయనకు యూనివర్సిటీలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ కెమిస్ట్రీ విభాగానికి చెందిన అసోసియేట్ ప్రొఫెసర్ రవికుమార్ కొట్టలంక గైడ్‌గా వ్యవహరించారని పేర్కొంది. విద్యార్థి తన పరిశోధనలో భాగంగా మొత్తం 4 ఎస్‌సీఐఈ పేపర్లు పబ్లిష్ చేశారని తెలియజేసారు. పీహెచ్‌డీ పట్టా పొందిన పగడాల ఈశ్వర్‌ను విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపకులు అభినందించారు.


18 వసంతాల 'నేటి దినపత్రిక సూర్య' మహాయజ్ఞంలో
'నేటి దినపత్రిక సూర్య' అక్షర సైనికుల భాగస్వామ్యంతో
అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను
అధిగమించింది. ఈ ప్రస్థానంలో
సూర్యాక్షరంతో మమేకమైన 'నేటి దినపత్రిక సూర్య'
కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు.
మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు,
శ్రేయోభిలాషులకు పేరుపేరునా
కృతజ్ఞతాభివందనాలు.

ఇట్లు.. పి. బాలు (చిన కొండయ్య)
బ్యూరో ఇన్‌చార్జి, ఉమ్మడి గుంటూరు జిల్లా.
సెల్ : 9705554777


# ప్రజా సమస్యల పరిష్కారానికి శాశ్వత మార్గం చూపండి

**అధికారులు ఆదేశించిన జిల్లా కలెక్టర్**

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**



ప్రజలు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందించిన ప్రతి పిటీషన్ క్షుణ్ణంగా పరిశీలించి శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ అధికారులను ఆదేశించారు. సోమవారం కలక్టరేట్ లోని ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మీ , సంయుక్త కలెక్టర్ ఏ. భార్గవ్ తేజ, డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీ కుమారి, డిఆర్ఓ ఎన్.ఎస్.కే.ఖాజావలి , ఆర్డిఓ శ్రీనివాస రావు , ఈడి ఎస్.సి కార్పొరేషన్ శ్రీనివాస్ ప్రజల నుండి 268 ఫిర్యాదులను స్వీకరించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల నుండి అర్జీలు స్వీకరించిన అనంతరం అధికారులతో జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన పిటీషన్లను గడువులోపు నాణ్యతగా పరిష్కరించాలన్నారు. మరో 24 గంటల్లో 4 పిటీషన్లు గడువు ముగిసి బియాండ్ ఎస్ఎల్ఏ లోకి వెళ్ళే అవకాశం ఉన్నందున సోమవారం సాయంత్రం లోపు పరిష్కరించా లన్నారు. ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి నాణ్యతగా పరిష్కరించాలన్నారు. జిల్లాలో వ్యవసాయ పనులు మొదలు అవుతున్నందున జిల్లాలో కౌలు రైతు కార్డు (సీసీఆర్సీ)ల టార్గెట్ ను అగ్రికల్చర్ అసిస్టెంట్లను సమన్వయం చేసుకుని సీసీఆర్సీ కార్డుల పంపిణీ చేసే లక్ష్యాన్ని పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు. శాఖల వారీగా పెండింగ్ దరఖాస్తులను జిల్లా సంయుక్త కలెక్టర్ ఏ. భార్గవ్ తేజ సమీక్షించి సూచనలు చేశారు. ఫిర్యాదుల పరిష్కారాన్ని నిర్ణీత గడువు లోపు ఎట్టి పరిస్థితుల్లోను పరిష్కరించాల్సి వుందన్నారు. కోర్టు కేసులకు సంబంధించి సమీక్షిస్తూ గౌరవ కోర్టులకు ఎప్పటికప్పుడు కౌంటర్లు దాఖలు పరచాలన్నారు. ఎలాంటి పరిస్థితుల్లో కూడా కేసు కంటెమ్ట్ వరకు వెళ్ళకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. పిటీషన్ల పరిష్కారంలో సమయపాలన పాటిస్తూ నాణ్యతగా పరిష్కరించి నపుడే సంతృప్తి స్థాయి పెరుగుతుందన్నారు. ఈ సమావేశంలో డీడీ గ్రౌండ్ వాటర్ వందనం, సిపిఓ శేషశ్రీ, ఎస్.ఈ పంచాయితీ రాజ్ బ్రహ్మయ్య, ఏడి హార్టికల్చర్ రవీంద్ర బాబు, జిల్లా ఉపాధి అధికారి దుర్గాబాయి, డిపిఓ బి.వి.నాగ సాయి కుమార్, ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ విజయ్ ప్రకాశ్, ఎల్ డి ఎం మహిపాల్ రెడ్డి తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# అర్జీల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

- మీ కోసంలో ప్రజల నుంచి 191 అర్జీలు
- పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు వెల్లడి



**నరసరావుపేట, మేజర్ న్యూస్ :** ప్రజా సమస్యల పరిష్కార వేది క'లో వచ్చే అర్జీల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి బాధ్యతతో పని చేయాలని జిల్లా కలెక్టర్ పి అరుణ్ బాబు ఆదేశించారు. పల్నాడు జిల్లా కలెక్టరేట్ లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. జిల్లా కలెక్టర్ తో పాటు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించే కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సూరజ్, డిఆర్ఓ, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు. వచ్చిన అర్జీలను ఆయా శాఖల అధికారులు సత్వరం పరిష్కరించేలా ప్రత్యేక శ్రద్ద చూపాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో వచ్చే ప్రతి అర్జీకి అర్థవంతమైన సమాధానం ఇస్తూ త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

# సారా రహిత జిల్లాగా పల్నాడు - జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు



**నరసరావుపేట, మేజర్ న్యూస్ :** సోమవారం సాయంత్రం కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్, ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారుల, ఇతర శాఖల అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. తొలుత జిల్లాలో ప్రభుత్వం మార్గదర్శకాలు మేరకు నాటు సారా నిర్మూలనకు చేపట్టిన చర్యలను ఎక్సైజ్ అధికారులు కలెక్టర్ కి వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు నవోదయం 2.0 కార్యక్రమంలో బాగంగా జిల్లాలో నాటు సారా నిర్మూలనకు ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో పటిష్ట చర్యలు చేపట్టినట్టు చెప్పారు. పల్నాడు జిల్లాలో నవోదయం కార్యక్రమం ప్రారంబించిన నాటికి, (4) స్టేషన్ల (నరసరావుపేట, క్రోసూరు, మాచర్ల, ఈపూరు) పరిధిలో 28 గ్రామాలలో నాటు సారా గుర్తించగా, అందులో 12 "ఏ " కేటగిరీ గ్రామాలు, 6 "బి" కేటగిరీ గ్రామాలు మరియు 10 "సి" " కేటగిరీ గ్రామాలు వున్నాయి. నాటు సారా నిర్మూలన లో భాగంగా మొదటి దశలో 116 అవగాహన సదస్సులు నిర్వహించినట్లు చెప్పారు., నాటు సారావలన కలిగే దుష్ప్రభావాలపై ప్రచార రథంపై ఊరురా తిరుగుతూ ప్రచారం నిర్వహించారు.. నాటు సారా నిర్మూలనలో భాగంగా రెండవ దశలో విస్తృతంగా దాడులు నిర్వహించి సారా తయారీ విక్రయాల్లో ఉన్న వారిపై (32) కేసులు నమోదు చేసి, 21 మందిని అరెస్టు చేయగా, 138 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు,11,400 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశామన్నారు. ఐదు బెల్లం ఊట కేసులలో ముద్దాయిలను గుర్తించి అరెస్టు చేశారు.. నవోదయం 2.%వా% లో భాగంగా 19 పాత సారా కేసులలో ఉన్న ముద్దాయిలను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచి రిమాండ్ కు తరలించారవి చెప్పారు. నరసరావుపేట ఎక్సైజ్ స్టేషన్ పరిదిలో 8 మంది ముద్దాయిలు, క్రోసూరు ఎక్సైజ్ స్టేషన్ పరిదిలో ఒక ముద్దాయి, మాచర్ల ఎక్సైజ్ స్టేషన్ పరిదిలో 10 మంది ముద్దాయిలను అరెస్టు చేశారు. గత నాలుగు సంవత్సరాల నుండి పాత కేసుల్లో ఉన్న 150 మంది ముద్దాయిలను, 30 మందిన అనుమానితులను గుర్తించి వారిపై నిఘా పెట్టారు, నవోదయంలో భాగంగా 123మంది ముద్దాయిలను సత్ప్రవర్తన క్రింద యు /ఎస్ 129 బి ఎన్ ఎస్ ఎస్ ప్రకారం తాసిల్దార్ కార్యాలయాల్లో బైండ్ ఓవర్ చేశారు ప్రస్తుతము నాటు సారాలో160 మంది బైండ్ ఓవర్లు అమల్లో ఉన్నాయి.. సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ఆదేశాల మేరకు కొత్త పుల్లారెడ్డిగూడెం, మోరసపెంట, హసనాబాద్ తండా, చింతల తండాలలో పోలీసులతో పాటు సారా పై దాడులు నిర్వహించి కార్డెన్ సర్చ్ చేశారు.. నిరంతర నాటు సారా సంబంధిత గ్రామాలో అటవీ ప్రాంతాలలో డ్రోన్ సాయంతో నిరంతర నిఘా పెట్టా రూ. బెల్లం వ్యాపారులందరికీ నోటీసులు ఇచ్చారు., ముద్దాయిల వివరాలు ఇచ్చి వారికి బెల్లం అమ్మ వద్దని హెచ్చరించారు. నాటు సారా తయారీలో ఉన్నవారికి బెల్లం సరఫరా చేసిన ఒక బెల్లం వ్యాపారిని అరెస్టు చేసిశారు. సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ సహకారంతో నాటు సారా పునరావృత్తి, పునరావతారం కాకుండా ప్రతిష్టమైన ప్రణాళికను రూపొందించినట్లు చెప్పారు. ఈ సమీక్ష సమావేశంలో భాగంగా డిప్యూటీ కమీషనర్ అఫ్ ప్రొహిబిషన్, ఎక్సైజ్, కే. శ్రీనివాసరావు, గుంటూరు , అసిస్టెంట్ కమీషనర్ అఫ్ ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్(ఎస్ టి ఎఫ్), మంగళగిరి, ఎం.సుధాకర్ రెడ్డి, అసిస్టెంట్ కమీషనర్ అఫ్ ప్రొహిబిషన్ ఎక్సైజ్ (ఈ ఎన్ ఎఫ్ టి) గుంటూరు, ఎం.రవి కుమార్ రెడ్డి, ప్రాజెక్టు డైరెక్టర్ డి.ఆర్.డి.ఐ పల్నాడు జిల్లా, డిస్ట్రిక్ట్ పంచాయతీరాజ్ పల్నాడు జిల్లా, డిస్ట్రిక్ట్ ట్రైబల్ ఆఫీసర్, పల్నాడు జిల్లా , డిస్ట్రిక్ట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కె. మణికంఠ, అసిస్టెంట్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ జి. సూర్యనారాయణ, (ఈ ఎఫ్ టి) గుంటూరు వారు, అసిస్టెంట్ ప్రొహిబిషన్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవీంద్ర, నరసరావుపేట, ఎక్సైజ్ స్టేషన్లో ఇన్‌స్పెక్టర్లు సిబ్బంది పాల్గొన్నారు.